ఈనాడు అమరావతి
గుంటూరు
శుక్రవారం అక్టోబరు 25, 2024

రబీకి బీమా ధీమా

ఈనాడు – అమరావతి

వచ్చే రబీ సీజన్ (2024-25)కు సంబంధించి పంటల బీమాకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఖరీఫ్‌లో ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి.. సాగు చేసిన రైతులందరికీ వర్తించేలా చర్యలు తీసుకుంది. రబీలో రైతు వాటా కింద నామమాత్రంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రబీలో సాగయ్యే పంటలన్నింటికీ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తారు. జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము, శనగ, వేరుసెనగ, వరి తదితర పంటలకు బీమా సౌకర్యం ఉంది. వరిని గ్రామం యూనిట్‌గా, వేరుసెనగను జిల్లా యూనిట్‌గా, మిగిలిన పంటలు మండలం యూనిట్‌గా అమలు చేస్తారు. రబీలో బ్యాంకుల నుంచి పంట రుణం తీసుకున్నట్లయితే ప్రీమియం మినహాయించుకుని బీమా సౌకర్యం కల్పిస్తారు. సొంత పెట్టుబడితో సాగు చేస్తే.. రైతులు సంబంధిత గ్రామాల్లో కామన్ సర్వీస్ కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డు, పొలం ధ్రువపత్రాలు, సీసీఆర్సీ కార్డు, సాగు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసుపుస్తకం ఇస్తే బీమా సౌకర్యం కల్పిస్తారు. పంటల బీమాలో నమోదైన రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంటలో వివరాలు నమోదు చేయించుకోవాలి.



జిల్లాలో ఎకరాకు వర్తించే బీమా, రైతు చెల్లించాల్సిన వాటా వివరాలు..

పంట	బీమా	రైతు వాటా
	(రూపాయల్లో)	
జొన్న	19,000	48
మొక్కజొన్న	38,000	114
పెసర	18,000	45
మినుము	20,000	50
శనగ	28,000	70

పంటల బీమాకు తుది గడువు	వరి	మిగిలిన పంటలకు
	డిసెంబరు 31	డిసెంబరు 15


మహానగరికి.. మరో మణిహారం

- అమరావతి రైల్వేలైన్‌తో ఈ ప్రాంతానికి మహర్దశ
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లావాసులకు వరం
- విజయవాడకు వెలుపల ఎర్రుపాలెం నుంచి ఆరంభం
- గుంటూరుకు ముందు నంబూరు స్టేషన్ వరకు నిర్మాణం

“అమరావతి రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఇది రాజధానికి మరో మణిహారంగా మారబోతోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, ప్రధానంగా విజయవాడ, గుంటూరు నగరాలకు వరంగా మారబోతోంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ భారీగా తగ్గించబోతోంది. విజయవాడతో సంబంధం లేకుండా 39 కిలోమీటర్ల దూరంలో మలుపు తిరిగి.. అమరావతి మీదుగా గుంటూరు, అక్కడి నుంచి ఇతర నగరాలకు తేలికగా చేరుకునేందుకు వీలు కలుగుతుంది. ఈ లైన్‌ను ఐకానిక్‌గా మార్చి పర్యాటకులను సైతం ఆకర్షించడంపైనా.. ప్రభుత్వం దృష్టి సారించింది. 57 కిలోమీటర్ల అమరావతి రైల్వే లైన్‌లో.. కృష్ణా నదిపై నిర్మించబోయే 3.2 కి.మీ. ఐకానిక్ వంతెన పర్యాటకులను ఆకర్షించబోతోంది. ఈ రైల్వేలైన్ పర్యావరణహితంగానూ ఉండబోతోంది. ఈ నూతన లైన్‌తో వాహన కాలుష్యాన్ని సైతం పెద్దఎత్తున తగ్గించబోతున్నారు.”



దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత రద్దీ స్టేషన్లలో విజయవాడ ఒకటి. నిత్యం రైల్వేస్టేషన్ మీదుగా 250 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. సాధారణ రోజుల్లోనే లక్ష మందికి పైగా ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారు. సెలవులు, పండగ రోజుల్లో రెండు లక్షల మంది దాటుతుంటారు.



పర్యావరణ హితపథం

ఎర్రుపాలెం-నంబూరు మధ్యలో తొమ్మిది కొత్త స్టేషన్లు రానుండడంతో ఈ ప్రాంతాలన్నింటికీ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. తద్వారా వాహన కాలుష్యం విపరీతంగా తగ్గుతుంది. పరిటాల రైల్వేస్టేషన్ వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ను నిర్మించనున్నారు. వీటన్నింటికి తోడు కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అసలు సంబంధమే లేకుండా ఉండేలా ఈ నూతన లైన్‌ను పర్యావరణహితంగా నిర్మించనున్నారు.

– ఈనాడు, అమరావతి

విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకల్లో జాప్యం, ప్లాట్‌ఫాంల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రత్యామ్నాయంగా విజయవాడకు చుట్టుపక్కల ఉన్న కృష్ణాకెనాల్(తాడేపల్లి), గుణదల, రాయనపాడు స్టేషన్లను శాటిలైట్‌గా మార్చాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. తాజాగా అమరావతి లైన్‌కు కూడా ఆమోదముద్ర పడడంతో.. గుంటూరు వైపు వెళ్లే రైళ్లు.. విజయవాడకు రావాల్సిన అవసరం ఉండదు.



పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా నిర్మాణం

అమరావతిని దేశంలో ప్రధాన నగరాలు అన్నింటితో కలిపేందుకు ఈ నూతన లైన్ దోహదపడుతుంది. ఈ నూతన లైన్‌ను అనుకున్న లక్ష్యంలోగా పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించబోయే ఈ లైన్‌లో అనేక విశేషాలుంటాయి. ఐకానిక్ వంతెన కూడా కృష్ణా నదిపై వస్తుండడంతో పర్యాటకాభివృద్ధికి సైతం దోహదపడుతుంది.

– పి.ఈ.ఎడ్విన్, ఏడీఆర్ఎం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విజయవాడ రైల్వేడివిజన్

భవిష్యత్తులో రెండో లైను: డీఆర్ఎం

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిని రైలు మార్గంతో అనుసంధానించే ప్రాజెక్టు నాలుగేళ్లలో పూర్తవుతుందని మండల రైల్వే అధికారి రామకృష్ణ తెలిపారు. రైల్ వికాస్ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త ప్రాజెక్టు ప్రారంభంలో సింగిల్ లైను ఉంటుందని, భవిష్యత్తులో రెండో లైను నిర్మాణానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ పనులన్నీ నిర్మాణ విభాగం అధికారుల పర్యవేక్షణలో జరగుతాయన్నారు. సమావేశంలో ఏడీఆర్ఎం సైమన్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజరు మనోహరరెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న రామకృష్ణ పక్కన మనోహరరెడ్డి, సైమన్ తదితరులు

మరో ముందడుగు: పెమ్మసాని



పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతికి నూతన రైలు మార్గం ఏర్పాటుతో కూటమి ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజధాని అభివృద్ధిలో ఇది మరో మైలురాయి కానుంది. ఈ ప్రాజెక్టు మంజూరైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు గుంటూరు పార్లమెంటు ప్రజలకు వరమని పేర్కొన్నారు.

విజయవాడ బయట నుంచే వెళ్లేలా...

దిల్లీ ప్రధాన లైన్‌లో వచ్చే రైళ్లు విజయవాడతో సంబంధం లేకుండా నేరుగా అమరావతి మీదుగా గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడకు 39 కిలోమీటర్ల దూరంలో కొండపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌కు వెలుపలి నుంచి సరిగ్గా ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఈ లైన్‌ను అమరావతికి అనుసంధానం చేస్తారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు స్టేషన్‌కు కలుపుతారు. నంబూరు నుంచి గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడ, గుంటూరు మధ్యలో నంబూరు ఉంటుంది. ఈ నూతన లైన్ విజయవాడకు బైపాస్ లాంటిదే. భవిష్యత్తులో ఈ లైన్ అత్యంత ప్రధానమైన మార్గంగా మారబోతోంది. అమరావతి నుంచి ఎర్రుపాలెం వైపు వస్తే దిల్లీ, హైదరాబాద్, అహ్మదాబాద్, ముంబయి వెళ్లిపోవచ్చు. నంబూరు నుంచి గుంటూరు స్టేషన్, అక్కడి నుంచి తెనాలి వస్తే ప్రధాన రైల్వే లైన్‌లో కలిసిపోతుంది. అక్కడినుంచి విశాఖ, చెన్నై, బెంగళూరు, కేరళ వరకూ వెళ్లిపోవచ్చు.

ఇంటి దొంగలను గుర్తించండి

సామగ్రి మాయంపై విచారణకు జీఎంసీ కమిషనర్ ఆదేశం

ఈనాడు కథనాలకు స్పందన

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ.. సర్కారు ఆస్తుల్ని కాపాడాల్సింది పోయి కొల్లగొడతారా? ఇది సహించరాని నేరం. ఈ చేతివాటం ఎన్నాళ్ల నుంచి నడుస్తోందో విచారించి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ‘కార్పొరేషన్‌లో దొంగలు పడ్డారు’ శీర్షికన గురువారం ‘ఈనాడు’ ఇచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఎస్ఈ నాగమల్లేశ్వరరావుతో విచారణకు ఆదేశించారు. హెడ్ వాటర్ వర్క్స్, వెహికల్ షెడ్, ఏటీ అగ్రహారంలో పాత సామగ్రి మాయం కావడానికి కారకులైనవారిని గుర్తించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఏ స్థాయి అధికారులైనా ఉపేక్షించేది లేదని, నివేదిక రాగానే బాధ్యులపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేయడంతోపాటు శాఖాపరమైన చర్యలకు ఆదేశిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. గురువారం ఉదయమే ఆయన వెహికల్ షెడ్‌ను తనిఖీ చేశారు. సామగ్రి మాయంపై ఆరా తీశారు. చోరీ వాస్తవమేనని కొంతమంది సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వాహన షెడ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని కమిషనర్ నిర్ణయించారు. చోరీ ఘటనపై ఈఈ సుందరరామిరెడ్డి అక్కడి ఉద్యోగుల నుంచి ప్రాథమికంగా వివరాలు తెలుసుకున్నారు. సామగ్రిని ఎలా తరలించారు? ఈ విషయం అధికారులకు ఎందుకు చెప్పలేదు? నగరంపాలెం స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి ఎవరు వెళ్లారు? తదితర వివరాలు సేకరించారు. హెడ్‌వాటర్ వర్క్స్‌లో చోరీ వెనుక ఓ అధికారి ఉన్నారని, అందుకే అక్కడి ఉద్యోగులు ఇప్పటిదాకా బయటకు చెప్పలేకపోయారని తెలిసింది. ఏటీ అగ్రహారం ట్యాంకుల్లో సామగ్రి చోరీపై విచారణ నివేదిక ఎందుకివ్వలేదని, ఇది కూడా ఇవ్వాలని కమిషనర్ ఆదేశించినట్లు నగరపాలకవర్గాలు తెలిపాయి.

అక్రమంగా సాగు చేసిన పంటల తొలగింపు

- సీఆర్డీఏ అధికారుల చర్యలు
- పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

తుళ్లూరు, న్యూస్‌టుడే : రాజధాని భూముల్లో అక్రమంగా సాగు చేసిన పంటలను సీఆర్డీఏ అధికారులు తొలగించారు. ‘సీఆర్డీఏ భూములైతే మాకేంటి’ శీర్షికన గురువారం ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీఆర్డీఏ తహసీల్దార్ కె.రవి బాబు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శాఖమూరు గ్రామంలో జొన్నకూటి ప్రశాంత్ సీఆర్డీఏ భూముల్లో అనధికారికంగా వేసిన మినుము పంటను పరిశీలించారు. అనంతరం ఆ భూముల్లో అనుమతి లేకుండా వేసిన పంటలు తొలగింపజేశారు. గ్రామంలో మరికొంత మంది వేసిన పంటలను పరిశీలించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. కొన్నేళ్లుగా సీఆర్డీఏ భూముల్లో పంటలు అక్రమంగా సాగు చేసి లబ్ధి పొందుతున్న వైకాపా నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తుళ్లూరు తహసీల్దార్ జి.సుజాత సీఐ గంగా వెంకటేశ్వర్లుకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. డిసెంబరులో రాజధాని నిర్మాణ పనులు జరుగుతాయని, భూముల్లో అనధికారికంగా ఎటువంటి పంటల సాగు చేపట్టవద్దని గ్రామాల్లో ప్రచారం చేయించారు. సీఆర్డీఏ భూములను ఆక్రమించినా, పంటలు అక్రమంగా సాగు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



శాఖమూరులో పంటలు తొలగింపజేస్తున్న సీఆర్డీఏ అధికారులు

మూలన పడ్డ మోటార్లు..

నీరందక జనం పాట్లు

ఈనాడు – అమరావతి

గుంటూరు నగరంలోని లక్ష్మీపురం హెచ్ఎల్ఆర్ ట్యాంకుల్లో మోటారు పంపుసెట్లు పది రోజులుగా మూలనపడ్డా పట్టించుకున్నవారు లేరు. ఓ గంట పని చేయకపోతే ఒక కాలనీకి నీటి సరఫరా ఆగిపోతుంది. అలాంటిది పది రోజుల నుంచి రెండు మోటార్లు పూర్తిగా పని చేయక గుజ్జనగుళ్ల ట్యాంకుల పరిధిలోని పది కాలనీలకు నీరందడం లేదు. హెచ్ఎల్ఆర్ నుంచి ఓ లైను ద్వారా ఇక్కడికి ట్యాంకులకు నీరు చేరుతుంది.

☛ ప్రస్తుతం ఎస్వీఎన్‌కాలనీ, చంద్రబాబు నాయుడుకాలనీ, నాయీబ్రాహ్మణ కాలనీ, సాయికృష్ణానగర్, కల్యాణి నగర్, రత్నగిరినగర్ తదితర పది కాలనీల్లో ప్రజలు నానా యాతన పడుతున్నారు.

☛ రెండు రోజుల క్రితం మోటారు పంపుసెట్‌ను పునరుద్ధరించారు. రెండోదానికి అవసరమైన సామగ్రి కోసం ఆర్డర్ పెట్టామని అవి శుక్రవారం సాయంత్రానికి వస్తాయని అధికారులు చెబుతున్నారు. దీని మరమ్మతు ఎప్పటికి పూర్తవుతుందన్నది స్పష్టత రావడం లేదు.

పది రోజుల నుంచి శివారు కాలనీల్లో వెతలు



రత్నగిరి కాలనీలో నీళ్ల ట్యాంకర్ల కోసం ఎదురుచూస్తున్న మహిళలు

☛ రెండు పంపుసెట్ల బుష్‌లు అరిగిపోయి మోటార్లు సామర్థ్యం మేరకు పని చేయడం లేదని, శుక్రవారానికల్లా సమస్య పరిష్కారమవుతుందని ఇంజినీరింగ్‌వర్గాలు తెలిపాయి. బుష్‌ల కోసం ఆర్డర్ పెట్టామని వెల్లడించాయి.

☛ అపార్ట్‌మెంట్లకు మినహా మిగిలిన ఇళ్లకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపుతున్నామని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నామని యంత్రాంగం చెబుతున్నా.. ఏ మూలకూ సరిపోవడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు. బహుళ అంతస్తుల భవనాల్లోనివారు అన్ని అవసరాలకూ నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు.

ఇళ్ల ముందు పీపాలు : కొన్ని కాలనీల్లో అద్దెకు తెచ్చుకున్న నీళ్ల పీపాలు ప్రతీ ఇంటి ముందు కనిపిస్తున్నాయి. నీళ్లందక ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను ఎప్పటికి పరిష్కరిస్తారో చెప్పాలంటే గురువారం రత్నగిరినగర్‌లో కాలనీవాసులు ఆందోళన చేశారు. సమస్య తీవ్రంగా ఉన్నా.. ఉన్నతాధికారులు రంగంలోకి దిగకపోవడాన్ని వారు ప్రశ్నించారు. ఇటీవల ఇంజినీరింగ్ విభాగంలో కొత్తగా వచ్చిన అధికారులకు తాత్కాలికంగా విధులు కేటాయించారు. తమకు అనుకూలమైన వార్డులు, కార్యాలయాలు రాలేదని చుట్టుపుచూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు.

గుంటూరుకు చెందిన శ్రీలక్ష్మి చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. ఈమెకు మంగళగిరి టెక్‌పార్కులో ఉద్యోగం వచ్చింది. మార్కుల ధ్రువపత్రాలతో హాజరుకావాలని వచ్చిన కాల్ లెటర్‌తో కళాశాలకు వెళ్లి అడగ్గా ఇంకా రూ. 35 వేల బకాయిలు చెల్లిస్తేనే అవి ఇస్తామంటూ బదులొచ్చింది.

పొన్నూరుకు చెందిన వెంకటేశ్వరరావు ప్రత్తిపాడుకు సమీపంలోని ఓ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేశారు. ఈయనకు జాబ్ ఆఫర్ వచ్చింది. మార్కుల ధ్రువపత్రాల కోసం కళాశాలకు వెళ్లి.. ప్రభుత్వం నుంచి బోధన రుసుములు రాగానే బకాయిలు చెల్లిస్తానని అండర్ టేకింగ్ లేఖ ఇస్తానని చెప్పినా యాజమాన్యం ససేమిరా అంది. టీసీ, మార్కుల పత్రాలివ్వని కారణంగా ఉద్యోగం దూరమైంది.

చిలకలూరిపేటకు చెందిన రమ్య తాడేపల్లికి సమీపంలోని ఓ ప్రైవేటు నర్సరీలో ఎంసీఏ చేశారు. హైదరాబాద్ వెళ్లి ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుందామంటే చేతిలో ధ్రువపత్రాల్లేవు. కారణం బోధన రుసుములు జమ కాకపోవడమే.

ఫీజుల బకాయి కడితేనే పత్రాలు

- నాడు బోధన రుసుములు చెల్లించని జగన్ సర్కారు
- సర్టిఫికెట్లు లేక అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులు
- కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ససేమిరా అంటున్న కళాశాలల యాజమాన్యాలు

ఈనాడు – అమరావతి

మీ పిల్లలు పెద్ద చదువులు చదవాలి.. ఇంజినీర్లు, డాక్టర్లు కావాలి.. ఆ చదువులకు బాధ్యత నాది.. అందుకవసరమయ్యే ఫీజులు మీ అన్న చెల్లిస్తారంటూ గత ఎన్నికల ముందు వరకు బాకా ఊదిన జగన్‌మోహన్‌రెడ్డి చివరకు విద్యార్థులను నిలువునా ముంచేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో బోధన రుసుములు, విద్యా దీవెన జమ చేయని కారణంగా వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల చేతికి ధ్రువపత్రాలు అందని పరిస్థితి. పిల్లల ఫీజులు చెల్లించకుండా ఆ మొత్తాన్ని నాటి జగన్ సర్కారు దారి మళ్లించడం వల్లనే గత విద్యా సంవత్సరంలో మూడు ఇన్‌స్టాల్‌మెంట్లు విడుదల కాలేదని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి.

☛ 2023-24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్ తదితర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు 20 వేలకుపైగానే ఉంటారని విద్యాశాఖవర్గాల సమాచారం. వీరిలో మూడొంతుల మంది బోధన రుసుములు, విద్యా దీవెన ఫీజులపై ఆధారపడి చదినవారే. ప్రస్తుతం అప్పోసప్పో చేసి కళాశాలలకు బకాయిలు చెల్లించి ధ్రువపత్రాలు తీసుకెళ్లాల్సి వస్తోంది.



☛ గత వైకాపా ప్రభుత్వ నిర్వాకం వల్ల విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేకపోతున్న విషయం తెలిసి తెదేపా కూటమి ప్రభుత్వం.. వారిని ఇబ్బంది పెట్టొద్దని, బకాయిలను విడుదల చేస్తామని, సంబంధిత పత్రాలు ఇచ్చేయ్యాలని ఆదేశించినా కళాశాలల యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి.

విద్యార్థులే చెల్లించాలని మెలిక

బోధన రుసుములు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను బలవంతపెడుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో ముగిసిన విద్యా సంవత్సరానికి మిగిలిన మూడు వాయిదాలను చెల్లించాల్సిందేనని పట్టుబడుతున్నాయి. పైగా ఈ విషయాన్ని బహిరంగంగానే అంగీకరిస్తున్నాయి. విద్యార్థుల చేతికి పత్రాలిస్తే వారి తల్లుల ఖాతాలకు జమైన రుసుమును కళాశాలలకు చెల్లించరని అందుకే బకాయిలు ముందే కట్టాలని చెబుతున్నామని ఇంజినీరింగ్ కళాశాలల అసోసియేషన్ నాయకుడొకరు తెలిపారు.

పత్తి ధరపై ప్రైవేటు కత్తి!

- భారీగా కోత పెడుతున్న వ్యాపారులు
- సీసీఐ మద్దతు కోసం రైతుల ఎదురుచూపులు

ఈనాడు – అమరావతి

ఖరీఫ్ పత్తి మార్కెట్లోకి వస్తోంది. కేంద్రం మద్దతు ధర ప్రకటించినా... భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. పల్నాడు జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలుకు రూ. 5,500 నుంచి రూ. 6,500 వరకు ఇస్తున్నారు. అక్టోబరు 1 నాటికి కొనుగోలు కేంద్రాలను తెరవాల్సిన సీసీఐ వర్షాలు, ఇతరత్రా కారణాలతో జాప్యం చేస్తోంది. మరోవైపు మిర్చి, వరి పంటలకు పెట్టుబడులు పెట్టాల్సిన రైతులు పత్తి దిగుబడులను వెంటనే అమ్మేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు ధరలను బాగా తగ్గించేస్తున్నారు.



ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తి

క్వింటా మద్దతు ధర రూ.7,521 : కేంద్రం ఈ ఏడాది క్వింటా పత్తికి మద్దతు ధర రూ. 7,521గా నిర్ణయించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగు విస్తీర్ణం ఆధారంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీసీఐ నిర్ణయించింది. ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లుల్లో సైతం కొనుగోలుకు ఏర్పాట్లు చేసింది. అయితే సాంకేతిక కారణాలతో కేంద్రాలు తెరవడంలో జాప్యం చోటుచేసుకుంటోంది. మార్కెటింగ్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, సీసీఐ అధికారులు ఇప్పటికే సమావేశమై వివిధాంశాలపై చర్చించారు. వ్యవసాయశాఖ నుంచి ఈ-పంట, ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు సేకరించిన మార్కెటింగ్ శాఖ డేటా సిద్ధం చేసింది. పత్తి కొనుగోలుకు సీసీఐ మాత్రం ముందుకు రావడం లేదు.

☛ వర్షాల కారణంగా నాణ్యత లేని పత్తి మార్కెట్‌కు వస్తోందని చెబుతూ ప్రైవేటు వ్యాపారులు ధరలో కోత విధిస్తున్నారు. ఒకవైపు వర్షాలు, నిల్వ చేసుకోవడానికి ఇబ్బందులు.. మరోవైపు పెట్టుబడులకు సొమ్ము అవసరమైన పరిస్థితుల్లో రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోంది. వర్షాలకు కొంత నాణ్యత తగ్గినా క్వింటాకు కనీసం రూ. 7 వేలైనా వస్తుందని రైతులు ఆశించినా పరిస్థితులు వేరేవిధంగా ఉన్నాయి. సీసీఐ వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మార్కెటింగ్‌శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

డీఈవోగా రేణుక



నగరపాలకసంస్థ (గుంటూరు): జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)గా పాఠశాల విద్య కమిషనరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీవీ రేణుకను నియమిస్తూ గురువారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ డీఈవోగా చేసిన పి. శైలజను బదిలీ చేస్తూ ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆమె 2022 ఏప్రిల్ 4 నుంచి ఇక్కడ విధుల్లో ఉన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు-నేడు పనులు సక్రమంగా జరిగేలా ఆమె చర్యలు తీసుకోలేదని విమర్శలు వచ్చాయి. కార్యాలయ పనివేళల్లో అందుబాటులో ఉండరనే అపవాదు ఉంది. ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పోస్టులు, ప్రైవేటు పాఠశాలల అనుమతుల విషయంలో ఆమెపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. పలు ఉపాధ్యాయ సంఘాలు విమర్శలు గుప్పించాయి.

తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యురాలి తొలగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన జడ్పీ సీఈవో
- తప్పుడు కులధ్రువపత్రంతో ఎన్నిక

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యురాలు మేరుగ సుభాషిణిని పదవి నుంచి తొలగిస్తూ గుంటూరు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్తిపాడు ఎంపీడీవో కె.శివపార్వతి గురువారం సుభాషిణికి ఉత్తర్వులు అందించారు. వివరాల్లోకి వెళ్లితే... ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికకు 2020, మార్చి, 5న రిజర్వేషన్లను ఖరారు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం ఎంపీటీసీ స్థానం బీసీ మహిళకు రిజర్వు చేసినట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. తుమ్మలపాలెం గ్రామానికి చెందిన మేరుగ సుభాషిణి ఎస్సీ ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేయగా జారీ చేశారు. తుమ్మలపాలెం ఎంపీటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించిన విషయం సుభాషిణి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో తన కులం బీసీ- సీ అని రాసి స్వతంత్ర అభ్యర్థినిగా నామపత్రాలు దాఖలు చేశారు. తర్వాత అప్పటి సమగ్ర శిక్షా సహాయ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నుంచి బీసీ- సీ కుల ధ్రువీకరణ పత్రం పొంది రిటర్నింగ్ అధికారికి అందించారు. ఈ స్థానంలో ఐదు నామినేషన్లు దాఖలు కాగా, అభ్యర్థులు నాలుగు నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో మేరుగ సుభాషిణి తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యురాలిగా స్వతంత్ర అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అప్పటి హోంమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వద్దకు వెళ్లి వైకాపాలో చేరారు.

లోకాయుక్త ఆదేశాలతో విచారణ : తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం పొంది ఎంపీటీసీ సభ్యురాలిగా మేరుగ సుభాషిణి ఎన్నికయ్యారని, విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త జింకా బాజీబాబు యాదవ్ 2022, జనవరి, 27న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి నివేదిక పంపాలని అప్పటి కలెక్టరును లోకాయుక్త ఆదేశించింది. తర్వాత కలెక్టరు వేణుగోపాలరెడ్డి పర్యవేక్షణలో జిల్లా స్థాయి కమిటీ విచారణ చేపట్టింది. విచారణ పేరుతో పలుమార్లు వాయిదాలు వేసి చివరకు ఏప్రిల్, 3, 2024న బీసీ సీ ధ్రువపత్రాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సుభాషిణి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారని విచారణలో తేలిందంటూ నివేదికను లోకాయుక్తకు పంపారు. దీంతో తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణ తేజ గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు జడ్పీ సీఈవో ఎంపీటీసీ పదవి నుంచి మేరుగ సుభాషిణిని తొలగిస్తున్నట్లు ఎంపీడీవోకు ఉత్తర్వులు పంపారు.

యువత.. కేరింత

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, సినీ నటులు డాక్టర్ ముత్తవరపు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ విద్యతో పాటు ఇతర రంగాలలోనూ రాణించినప్పుడే అసలైన విజయం దక్కుతోందన్నారు. కళారంగంలో ఉన్న వారినే ఎక్కువ విజయాలు వరిస్తాయని, అవి సమాజాన్ని మేల్కొల్పుతాయని చెప్పారు. సినీ నటుడు సురేష్ బాబు మాట్లాడుతూ కృషి, పట్టుదల, నిజాయతీ ఉంటే విజయం మీ సొంతమవుతోందని చెప్పారు. రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, యువజనోత్సవాల సమన్వయకర్త ఆచార్య మురళిమోహన్ మాట్లాడారు. ప్రిన్సిపాళ్లు జాన్సన్, సిద్ధయ్య, ప్రమీలారాణి, ఆచార్యులు ఎన్‌వీ కృష్ణారావు, ధనలక్ష్మి, మాధవి, త్రిమూర్తి రావు తదితరులు పాల్గొన్నారు.


మైమ్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ప్రతిభ చాటారు..యువజనోత్సవాలలో విద్యార్థులు దుమ్ములేపారు. తమలో దాగి ఉన్న కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. సంప్రదాయ, జానపద నృత్యాలతో సందడి చేశారు. చిత్రలేఖనం, మైమ్స్, వాయిద్యాలతో కదం తొక్కారు. భరత నాట్యంతో విద్యార్థినులు అలరించారు. సంగీతం, థియేటర్ ఆర్ట్స్‌లో పోటీపడి ప్రదర్శనలు ఇచ్చారు. మేకప్, వస్త్రధారణ, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్స్‌తో సందడి చేశారు. పోస్టర్ మేకింగ్, స్పాట్ పెయింటింగ్‌లతో సత్తాచాటారు.


వాయిద్యాలు వాయిస్తూ..

బాబోయ్ కోతులు..

వసతిగృహ విద్యార్థినులపై దాడి

ఇద్దరికి గాయాలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : దుగ్గిరాల ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో గురువారం కోతులు హల్‌చల్ చేశాయి. మీద పడి కరవడంతో ఇద్దరు బాలికలకు గాయాలయ్యాయి. విద్యార్థినులు జెబలేటిలో యారు. గురువారం ఉదయం 8.30 గంటల సమయంలో బాలికలు అల్పాహారం చేస్తున్న సమయంలో వంట వద్దకు వచ్చారు. దీంతో ఒక్కసారిగా కోతులు దాడిచేయడంతో వి.నందిని, డి.శౌభాగ్య అనే బాలికలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వార్డెన్ నిర్మలకుమారి వసతిగృహానికి వచ్చారు. విషయం తెలిసిన ఎస్సై కానిస్టేబుళ్లను అక్కడకు పంపారు. బాధిత బాలికలను తెనాలిలోని ప్రభుత్వాసుపత్రికి పంపారు. తహసీల్దార్ సునీత ఈ విషయాన్ని సబ్ కలెక్టర్‌కు తెలియజేశారు. ఆమె ఆసుపత్రి వర్గాలకు ఫోన్ చేసి వెంటనే చికిత్స చేయాల్సిందిగా సూచించారని తహసీల్దార్ చెప్పారు. అక్కడ బాలికలకు వ్యాక్సిన్ చేశారు. మరో నాలుగు డోసులు వేయాల్సిఉందని, అవి ఎలా వేయించాలో అక్కడి వైద్యులు సూచించారని సునీత తెలిపారు. తహసీల్దార్ సునీత, ఎస్సై వెంకటరవి, ఎంపీడీవో శ్రీనివాసరావు వసతి గృహానికి వచ్చారు. విద్యార్థినులతో మాట్లాడారు. వారి సమస్యలు విన్న అధికారులు నాలుగైదు రోజుల్లో మండల పరిషత్ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు తాళ్ల అశోక్‌యాదవ్, దేవరపల్లి చంటి తదితరులతో కలిసి శ్రీఅనిత గురువారం హాస్టల్‌ను పరిశీలించారు. బాధిత బాలికలతో మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.


విద్యార్థినుల కాళ్లకు గాయాలు

జగన్‌కు శవరాజకీయాలు బాగా అలవాటు: మంత్రి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: 'జగన్‌మోహన్ రెడ్డికి తొలి నుంచి శవరాజకీయాలు బాగా అలవాటు. తండ్రి చనిపోతే బాధపడలేదు. శవం వద్ద కుర్చొని సంతకాలు పెట్టించుకున్నాడు. హూ కిల్డ్ బాబాయ్. ఇకనైనా శవరాజకీయాలు మానుకోవాలి' అని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. గుంటూరులో గురువారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఆయన ఏం చేశాడని, ఇటీవల జరుగుతున్న అత్యాచారాలకు వైకాపా ప్రభుత్వం చేసిన అరాచకాలే కారణమని, రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ మాఫియాగా మార్చేశారన్నారు. నవరత్నాల పేరుతో రాష్ట్రాన్ని దోచుకోవడం, దాచుకోవడం చేశారని విమర్శించారు. కర్నూలులో వారి దౌర్జన్యాలకు ఓ కుటుంబం రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకుందని గుర్తుచేశారు. గత ఐదేళ్లల్లో 2,027 మంది మహిళలపై దారుణాలు జరిగాయని వారికి ఏ న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 74 మందిపై అత్యాచారాలు జరిగాయని అంటున్నారు? వాటిపైన చర్చకు జగన్ సిద్ధమా అని నిలదీశారు. తన ఇంట్లోని తల్లి, చెల్లెల్ని ఆయన పట్టించుకోలేదన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్తా, కోడళ్లపై జరిగిన దారుణంలో వెంటనే ఆరుగురిని, బద్వేల్‌లో యువతికి నిప్పుపెట్టిన వెంటనే కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మహిళల పక్షపాతి అయిన సీఎం చంద్రబాబునాయుడు మహిళలపై నేరాలు జరగకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు? తప్పు ఎవరు చేసినా, ఏ పార్టీవారైనా కఠినంగా శిక్షించాలని, బాధితులకు నష్టపరిహారం ఇచ్చేలా ఆదేశించడంతోపాటు అమలు చేస్తున్నారని వివరించారు. నేరస్థులకు శిక్షలు పడేలా ఫాస్టుట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు.


మాట్లాడుతున్న మంత్రి సవిత

గ్రామస్థులకు రూ. 600 బయటి వారికి రూ. 1500

వైకుంఠపురం ఇసుక రీచ్‌లో లోడింగ్ పరిస్థితి ఇది

తుళ్లూరు, న్యూస్‌టుడే : పల్నాడు జిల్లా, వైకుంఠపురం రీచ్‌లో ఇసుక కోసం వెళ్లిన తుళ్లూరు మండలం, వడ్డమాను గ్రామస్థులకు చేదు అనుభవం ఎదురైంది. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 1500లు ఇస్తేనే ఇసుక లోడ్ చేస్తామని అక్కడి కార్మికులు డిమాండ్ చేశారు. లోడింగ్‌కు రూ. 600లే కదా అని అడిగితే.. వైకుంఠపురం గ్రామం వారికి మాత్రమే రూ.600 రేటు అని వారు సమాధానం చెప్పారు. అయితే మేమే ఇసుక తవ్వి తీసుకెళ్తామని చెప్పగా వైకుంఠపురం కార్మికులు అభ్యంతరం తెలిపారు. స్థానికుల్లో అభిప్రాయ భేదాల కారణంగా గురువారం రీచ్‌లో ఇసుక లోడింగ్ నిలిచిపోయింది. ట్రాక్టర్లు, ఎండ్ల బండ్లలో రీచ్‌ల నుంచి ఎవరైనా వ్యక్తిగత అవసరాల కోసం ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కొందరు అడ్డుపటం దారుణమని స్థానికులు వాపోతున్నారు.

ప్రియుడిపై యాసిడ్ దాడి


శ్రీకాకుళం, న్యూస్‌టుడే: ప్రియుడిపై ప్రియురాలు యాసిడ్ పోసిన ఉదంతమిది. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండల ఎస్సై ప్రవల్లిక తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నగరం బ్రాడీపేటకు చెందిన కె.ప్రసాద్ విజయనగరంలోని డెంకాడలో లారీ చోదకుడిగా పనిచేస్తున్నాడు. తొమ్మిది నెలల కిందట బూర్జ మండలం ఓవీపేటకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా వారిద్దరు ఆముదాలవలసలోని పూజారిపేటలో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో వారి మధ్య మనస్పర్థలు రావడంతో ఇటీవల ఆమె తన స్వగ్రామం ఓవీపేటకు వెళ్లిపోగా అతను డెంకాడ వెళ్లిపోయాడు. ఈ నెల 23న ప్రసాద్‌ను ఆమదాలవలస రమ్మని ఆ మహిళ చెప్పడంతో యువకుడు అక్కడికి వెళ్లాడు. సాయంత్రమైనా ఆమె రాకపోయేసరికి నేరుగా ఓవీపేటలోని మహిళ ఇంటికి వెళ్లాడు. మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆమె యువకుడి ముఖంపై యాసిడ్ పోసింది. గాయపడిన ఆ యువకుడు ఈ ఘటనపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేటి నుంచి పశు గణన

జిల్లాపరిషత్తు: పశు సంవర్ధక రంగంలో భవిష్యత్తు ప్రణాళిక, విధాన రూపకల్పన కోసం నిర్వహించనున్న 21వ అఖిల భారత పశుగణన కోసం గృహాలకు వచ్చిన సిబ్బందికి అవసరమైన సమాచారాన్ని ఇచ్చి ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టరు ఎస్. నాగలక్ష్మి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఈనెల 25 నుంచి ప్రారంభించనున్న పశుగణన కార్యక్రమానికి సంబంధించిన ప్రచార సామగ్రి, స్టిక్కర్లను కలెక్టరు ఆవిష్కరించారు.

సీఎం నివాసం వద్ద కొండచిలువ కలకలం

తాడేపల్లి, న్యూస్‌టుడే : గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం సమీపంలోని మీడియా పాయింట్ వద్ద గురువారం కొండచిలువ చనిపోయి కనిపించింది. చుట్టుకుని ఉండటంతో దానిని చూసిన వారంతా ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని మీడియా పాయింట్‌లోని ప్రతినిధులు సీఎం భద్రతా సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. ఏదో గుర్తుతెలియని జంతువును మింగిన కొండచిలువ కదల్లేని పరిస్థితుల్లో చనిపోయిందని భావిస్తున్నారు. భద్రతా సిబ్బంది దానిని పరిశీలించి అక్కడ నుంచి తొలగించారు.



ఉచితంగా సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలు

ఈనాడు, విశాఖపట్నం: యూకేకు చెందిన హీలింగ్ లిటిల్ హార్ట్స్, మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో 32వ ఉచిత పిల్లల గుండె శస్త్రచికిత్సల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు పేర్కొన్నారు. కేజీహెచ్ సమీపంలోని ఆంధ్రా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఈ నెల 21 నుంచి 26 వరకు 15 సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 9 మంది చిన్నారులకు శస్త్రచికిత్స పూర్తయ్యింది. విశాఖలో రెండోసారి ఈ శిబిరం నిర్వహిస్తున్నాం. తొమ్మిదేళ్లలో విజయవాడ, విశాఖలోని ఆంధ్ర హాస్పిటల్స్‌లో 4000 గుండె శస్త్రచికిత్సలు జరిగాయి. వాటిలో అధిక శాతం ఎన్టీఆర్ వైద్యసేవ, మహేష్‌బాబు ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో ఉచితంగా చేసినవే. ఆంధ్ర హాస్పిటల్స్ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాలజీ, నవజాత శిశువులు, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందాలు కలసికట్టుగా పనిచేయడంతో ఇది సాధ్యపడింది. రాబోయే రోజుల్లో ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి ఈ శిబిరం నిర్వహిస్తాం' అని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర హాస్పిటల్స్ వైద్య నిపుణులు రేవంత్, విక్రమ్, రవీంద్ర దేవ్, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, పద్మావతి తదితరులు మాట్లాడారు. యూకేకు చెందిన వైద్య నిపుణులు సిమోన్, స్నిగ్ధ పద్మాశ్వార్, శరన్ దురైరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు, వైద్య నిపుణులు

హాల్ టిక్కెట్లు ఇవ్వలేదు.. పరీక్షలు రాయలేకపోతున్నాం

మేడికొండూరు, న్యూస్‌టుడే : హాజరు తక్కువగా ఉందనే నెపంతో పరీక్షలు రాయనివ్వడం లేదంటూ విద్యార్థులు, తల్లిదండ్రులూ ఆందోళన చేసిన ఘటన గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్లలోని ఒక ఫార్మసీ కళాశాలలో గురువారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధిత విద్యార్థులు 'న్యూస్‌టుడే' ప్రతినిధితో మాట్లాడారు. కళాశాలలో ఫార్మసీ నాలుగో ఏడాదికి సంబంధించి మొత్తం 38 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. అధ్యాపకుల కొరత ఉందని, తరగతులు సక్రమంగా జరగడం లేదన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయన్నారు. దీనికి సంబంధించి కళాశాలలో రెండు రోజులుగా ల్యాబ్, ప్రాజెక్టు పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో 22 మంది విద్యార్థులకు హాజరు శాతం తక్కువగా ఉందని నెపంతో హాల్ టిక్కెట్ ఇవ్వలేదన్నారు. దీంతో తాము పరీక్ష రాయలేక పోతున్నామని, తమ భవిష్యత్తు ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. హాజరు శాతం తక్కువగా ఉంటే ముందుగా ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఇంటర్నల్ మార్కులు వేయడంలో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ల్యాబ్ సౌకర్యం కూడా లేదని తెలిపారు. నిబంధనలకు మించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సమాచారం అందుకున్న మేడికొండూరు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇరు వర్గాల వారితో మాట్లాడినా సమస్య కొలిక్కి రాలేదు. విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లు పరీక్షలన్నీ రాయించే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు ఇంటర్నల్ మార్కులు తదితర అంశాలు నెరవేరుస్తామని కళాశాల లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రం ఇవ్వాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సిబ్బందికి, తల్లిదండ్రుల మధ్య వాగ్వాదం జరిగింది. కళాశాల యాజమాన్యం తమ డిమాండ్లను అంగీకరించకపోతే శుక్రవారం కూడా ఆందోళన కొనసాగిస్తామన్నారు.


కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

రూ.50 లక్షల విలువైన నకిలీ సిగరెట్ల పట్టివేత


పట్నంబజారు, న్యూస్‌టుడే: ఫిరంగిపురం మండలం నుదురుపాడు సమీపంలో గురువారం సెంట్రల్ జీఎస్టీ అధికారులు తనిఖీ చేసి ఓ లారీలో అక్రమంగా రవాణా అవుతున్న సిగరెట్లను గుర్తించారు. అధికారులకు అనుమానం వచ్చి లారీ డ్రైవర్ వద్ద ఇన్‌వాయిస్‌ను పరిశీలించగా 2.77 లక్షల అగ్గిపెట్టెలు రవాణా అవుతున్నట్లు రాసి ఉంది. లారీలోని 46 పాలీ బ్యాగులను అధికారులు తెరచి చూడగా, వాటిలో మొత్తం 11,04,000 సిగరెట్లు ప్యాకెట్లు ఉన్నట్లు తనిఖీలో వెల్లడైంది. సిగరెట్ల ప్యాకెట్లు అన్ని అగ్గిపెట్టె ప్యాకెట్లను పోలి ఉన్నాయి. సిగరెట్లను ఇన్‌వాయిస్‌లో చూపకుండా పన్ను ఎగవేతకు పాల్పడుతున్న రవాణా చేస్తున్నట్లు గుర్తించి సిగరెట్లను స్వాధీన పరచుకున్నారు. సిగరెట్ల ప్యాకెట్లపై ఉన్న ఎంఆర్‌పీ ప్రకారం వాటి మార్కెట్‌లో విలువ దాదాపు రూ.50 లక్షలు పైగానే ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. తయారు, ముగింపుతేదీలు లేని కారణంగా వాటిని నకిలీ బ్రాండెడ్ సిగరెట్లుగా అధికారులు తేల్చారు. జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అధికారులు బి.లక్ష్మీనారాయణ, జి.రవికుమార్, ఎం.నాగరాజు, గాదె శ్రీనివాసరెడ్డి, నవీన్‌రాజు, యుగంధర్ తనిఖీలో పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సిగరెట్లు, లారీ

రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక కేంద్రాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఏపీ సీఆర్డీఏకు భూ సమీకరణ పథకంలో భూములు ఇచ్చిన రైతులకు (గతంలో కేటాయించని వారికి) రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపునకు రెండో రోజు గురువారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో లాటరీ నిర్వహించారు. కార్యక్రమంలో 9 రాజధాని గ్రామాలకు చెందిన 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లు అందజేశారు. రైతులకు త్వరితగతిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుగా ప్రభుత్వం 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్ల ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పొందిన రైతులు సంబంధిత కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ బి.ఎల్.ఎన్ రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.డేవిడ్‌రాజు, జి.భీమారావు, కె.స్వర్ణమేరి, జి.సాయి శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.


రైతుకు ప్లాట్ల కేటాయింపు పత్రాలు అందిస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్

బ్రాయిలర్ ధరలు (కిలో ఒకటికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, రిటైల్ ధర - 150, చికెన్ విత్‌స్కిన్ - 218, చికెన్ స్కిన్‌లెస్ - 248.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, 142, 153 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

మంగళగిరి చేరిన సీఎం కృతజ్ఞతాయాత్ర

మంగళగిరి, న్యూస్‌టుడే: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞత యాత్ర గురువారం మంగళగిరి చేరింది. ఏపీలో ఎస్సీ వర్గీకరణపై సుస్పష్టమైన వైఖరితో ఉన్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ యాత్ర చేపట్టారు. ఈ మేరకు మంగళగిరి చేరిన యాత్రలోని ప్రతినిధులు డాక్టర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఏడాది ఆగస్టులో హిందూపురంలో ప్రారంభమైన ఈ యాత్ర ఇచ్ఛాపురం వరకు సాగనుంది. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



పెదనందిపాడులో ప్రదర్శన

పెదనందిపాడు: చిన్నారులకు రెండు చుక్కలు వేయించాలి. చేయి చేయి కలుపుదాం. పోలియో నివారిద్దాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అశోక పాఠశాల విద్యార్థులు పెదనందిపాడు ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు శివప్రసాద్, డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సభ్యులు శ్యాంసన్, సాంబశివరావు, సీహెచ్‌వో ప్రసాద్‌స్వామి, ఆరోగ్య పర్యవేక్షకుడు చెన్నయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడికొండ గ్రామంలోని కంతేరు రోడ్డు నూరాని వీధి దగ్గర చెత్త పేరుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రివేళ చెత్త, వ్యర్థాలు కనిపించక వాహన చోదకులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. **- శ్రీనివాస్, ఆటో డ్రైవర్**

✔ కంతేరు ప్రధాన రహదారిలో వ్యర్థాలు తొలగిస్తాం. ప్రధాన రహదారిలో చెత్త డంప్ చేయకుండా ప్రజలు సహకరించాలి.
- హరిబాబు, తాడికొండ పంచాయతీ కార్యదర్శి
– తాడికొండ, న్యూస్‌టుడే

పట్టభద్రుల ఓటు నమోదు 27న

దుగ్గిరాల, న్యూస్‌టుడే : పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమం ఈ నెల 27న ఆదివారం దుగ్గిరాలలోని శివాలయం కూడలి, జమ్మిచెట్టు కూడలి, ఏఈఎల్‌సీ చర్చి పురవీధి, అలీనగర్, వీరేశ్వర వద్ద నిర్వహిస్తున్నట్లు తెదేపా నాయకులు గురువారం తెలిపారు. అర్హులైన వారందరూ నమోదు చేసుకోవాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు

గనికపూడి(ప్రత్తిపాడు), వట్టిచెరుకూరు, పెదనందిపాడు, న్యూస్‌టుడే : గనికపూడి గ్రామ సచివాలయంలో బుధవారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కరించాలని 16 అర్జీలను రైతులు అందించినట్లు తహసీల్దార్ జి.కరుణకుమార్ చెప్పారు. వీర్భద్ర తగ్గలం, 22ఎ కింద కొందరి రైతుల సర్వే నంబర్లు నమోదు, అడంగల్‌లో పేర్ల సవరణ, ఖాతా నంబర్ మార్పులు వంటి అంశాలపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. డిప్యూటీ తహసీల్దారు వై.ధర్మతేజ, సర్వేయరు శ్రీనివాసరావు, ఎంపీడీవో జి.రామకృష్ణ, వీఆర్వో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

✤ వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడు, లేమల్లెపాడు, గారపాడు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించినట్లు ఉప తహసీల్దారు దరియావలి గురువారం తెలిపారు. పలువురు రైతులు తమ సమస్యలను చెప్పారన్నారు. ఆర్‌ఐ వరప్రసాద్ హాజరయ్యారు.


పెదనందిపాడు: తహసీల్దార్ శంకరబాబుకు అర్జీ అందజేస్తున్న రైతు

✤ పెదనందిపాడు మండలంలోని రావిపాడులో గురువారం జరిగిన గ్రామసభలో తహసీల్దార్ శంకరబాబు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. 18 మంది వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీదేవి, డీఏ శ్రీనివాసరావు, ఎంపీడీవో సాహితీ, సర్వేయర్ టి. శ్రీనివాసరావు, వీఆర్వోలు ప్రసాద్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు



★ మంగళగిరిలో మౌలిక సదుపాయాలకు ప్రణాళిక
★ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి

మంగళగిరి, న్యూస్‌టుడే

మంగళగిరిలో అభివృద్ధి అడుగులు పడుతున్నాయి. లక్షకుపైగా జనాభా నివసిస్తున్న ఈ నగరం క్రమంగా విస్తరిస్తోంది. పెరుగుతున్న జనాభాకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఒక్కొక్కటి కార్యరూపం దాల్చుతోంది.

మంగళగిరి, తాడేపల్లి పురపాలక సంఘాలను 2021లో అప్పటి వైకాపా ప్రభుత్వం నగరపాలక సంస్థగా ఏర్పాటు చేసింది. రూ.1200 కోట్లు నిధులు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసింది. అసంపూర్తి పనులతో ప్రజలు అవస్థలు పడ్డారు. గత సార్వత్రిక ఎన్నికల్లో నారా లోకేశ్ మంగళగిరి నుంచి గెలుపొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మంగళగిరిని నంబర్‌వన్‌గా చేసి చూపుతానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కార్యాచరణ మొదలైంది. సుందర పట్టణంగా మంగళగిరిని తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నారు. నిరుద్యోగ సమస్యలేకుండా చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. మంగళగిరి, తాడేపల్లిలో చేపట్టాల్సిన పనులపై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు.


నగరంలోని ప్రధాన రహదారి

నగరంలో భూగర్భ డ్రైనేజీ

ఓపెన్ డ్రైనేజీ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సమయంలో కాలువలు పొంగి మురుగు రోడ్లపై చేరి అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మూడు నెలల్లో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీంతో పాటు భూగర్భంలో విద్యుత్తు తీగలు, వంటగ్యాస్ పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రతీ ఇంటికి పైపులైను అనుసంధానం చేసే విధంగా కార్యాచరణ రూపొందించారు.

వంద పడకల వైద్యశాలకు రూ.52 కోట్లు

మంగళగిరిలో ప్రభుత్వ వైద్యశాల స్థాయిని పెంచేందుకు నిధులు మంజూరయ్యాయి. లోకేశ్ హామీలో భాగంగా 30 పడకలుగా ఉన్న ఆసుపత్రిని వంద పడకలుగా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రూ.52 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మంగళగిరి పరిసర ప్రాంతాల్లో కార్పొరేట్ వైద్యశాలలు, ఎయిమ్స్ వంటివి ఉన్నప్పటికీ ఆసుపత్రి స్థాయి పెంపుతో పేద మధ్యతరగతి వర్గాలకు మేలు చేకూరుతుంది.

●● నియోజకవర్గంలో సౌర విద్యుత్తు వినియోగ లబ్ధిదారులపై భారం పడకుండా కేంద్రం నుంచి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద వచ్చే రాయితీతోపాటు బ్యాంక్ నుంచి రుణం ఇప్పించి యూనిట్లు ఏర్పాటు చేయబోతున్నారు. దీనివల్ల విద్యుత్తు ఛార్జీల భారం తగ్గుతుంది.

●● మంగళగిరిలోని శ్రీపానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కొండ పైకి వెళ్లే ఘాట్‌రోడ్‌తోపాటు గండాలయ స్వామి అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నారు. పెదకోనేరు అభివృద్ధి చేసి చారిత్రక కట్టడాలను పరిరక్షించాలని సంకల్పించారు.

●● కృష్ణానది నుంచి శుద్ధి చేసిన జలాలను తీసుకుని నగరమంతా నూతన పైపులైను ద్వారా అందించాలని సంకల్పించారు.

●● నియోజకవర్గంలో ఎంతమంది చదువుకున్న వారు ఉన్నారు? ప్రస్తుతం వారు ఏ పని చేస్తున్నారు? వారిలో ఎలాంటి నైపుణ్యం ఉంది? ఏ పని చేయాలని కోరుకుంటున్నారు వంటి అంశాలపై నగరపాలక సంస్థ నైపుణ్య గణన చేస్తున్నారు. పూర్తి కాగానే ఎవరెవరికి ఎలాంటి ఉద్యోగాలు కల్పించాలో అనే అంశంపై చర్యలు చేపట్టనున్నారు.

●● మంగళగిరి- తాడేపల్లి నగరంలో చెరువులను పరిశీలించి వాటి చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టాలని సంకల్పించారు. నగరంలోని రహదారులను సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

టెక్ ఫెస్ట్‌లతో నైపుణ్యాల వెలికితీత



ప్రతిభ చూపిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ చంద్రశేఖర్

తాడికొండ,న్యూస్‌టుడే: స్థానిక లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్స్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌ను గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ పోటీల్లో వివిధ కళాశాలల నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కళాశాల సీఎస్ఈ విభాగాధిపతి ఎ. బాలాజీ మాట్లాడుతూ పోటీల్లో ప్రతిబ చూపిన వారికి బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్-అకడమిక్స్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకల గుర్తింపు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన ఫిరంగిపురంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ జిల్లా రిసోర్స్ పర్సన్ అనిల్ మాట్లాడుతూ గ్రామంలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి పనులు పరిశీలించామన్నారు. ఇందులో అవకతవకలు జరిగాయని గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన రెండు ఇళ్లకు ఉపాధి హామీ పథకం ద్వారా పని చేయకుండానే చేసినట్లు లెక్కల్లో చూపుతూ రూ.4వేలు జమ చేశారని చెప్పారు. మరో మూడు గృహాల్లో పనికి సంబంధించి అదనంగా రూ.10వేలు జమయ్యాయని తెలిపారు. గ్రామంలో చెరువు గట్టుపై 160 కొబ్బరి మొక్కలు నాటినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అక్కడ పరిశీలిస్తే 130 మొక్కలు మాత్రమే ఉన్నట్లు తేలిందని చెప్పారు.


మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ అనిల్

ముక్కలు చేసి.. తరలించి

తుళ్లూరు, న్యూస్‌టుడే : అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు తుది దశకు చేరాయి. జేసీబీలతో ముళ్ల కంప తొలగించడంతో రాజధాని ప్రాంతంలోని కట్టడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎండిన చెట్లను సీఆర్డీఏ అనుమతితో చిన్న పరిశ్రమలకు చెందిన కొందరు తమ యంత్రాలతో చిన్న ముక్కలుగా చేసి లారీల్లో తరలించుకు పోతున్నారు. గురువారం అనంతవరం, దొండపాడు గ్రామాల మధ్యలో ఉన్న సీఆర్డీఏ భూముల్లో ట్రాక్టర్‌కు బిగించిన యంత్రం చెట్లను ముక్కలుగా చేసి కుప్పగా పోసింది. రాజధానిలో ఎండిన ముళ్లకంపను ముక్కలుగా చేసి తీసుకెళ్లేందుకు పెద్ద కంపెనీలు ముందు రాలేదని సీఆర్డీఏ అధికారులు తెలిపారు.


ముళ్ల కంపను ముక్కలు చేస్తున్న యంత్రం

అమరావతికి రైల్వేలైన్‌పై రాజధాని రైతుల హర్షం

తుళ్లూరు, న్యూస్‌టుడే : అమరావతి రైల్వే లైనుకు కేంద్రం పచ్చజెండా ఊపడంపై గురువారం రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నంచి అమరావతి మీదుగా రైల్వే లైను మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి పథంలోకి రావడం శుభపరిణామం అని ఆనందం వ్యక్తం చేశారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన


వంశీకృష్ణరాజాను సన్మానిస్తున్న అధ్యాపకులు

మేడికొండూరు, న్యూస్‌టుడే : డోకిపర్రు పరిధిలోని యూనివర్సల్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్, డాక్టర్ పి. వంశీకృష్ణరాజా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో క్లౌడ్ వినియోగం ఎక్కువగా ఉందన్నారు. అంతర్జాలంలో క్లౌడ్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని తెలిపారు. దీని ఆధారంగా అంతర్జాలంలో ఎన్నో రకాల సేవలు అందుతున్నాయని తెలిపారు. వంశీ కృష్ణ రాజాను సన్మానించి జ్ఞాపిక అందించారు. కళాశాల కరస్పాండెంట్ పామిశెట్టి బాలస్వామి, ప్రిన్సిపల్ ఎం.కోటిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొర్రపాడు వంతెనపై బయటకు వచ్చిన ఇనుప చువ్వలు
భీమినేనివారిపాలెం వద్ద భారీ గొయ్యి
14వ మైలు, కొర్రపాడు మధ్య ఇలా
కొర్రపాడు వంతెనపై మరో గుంత

రహదారి ఇలా.. రాకపోకలు ఎలా?

మేడికొండూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్లు అభివృద్ధి నోచుకోలేదు. గత అయిదేళ్లు ఎవరూ పట్టించుకోకపోవడంతో మేడికొండూరు మండలంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దారి పొడవునా గుంతలు పడ్డాయి. గుంటూరు - హైదరాబాదు మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. రాత్రిళ్లు గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి చోదకులు కిందపడిపోతున్నారు. గోతుల కారణంగా చోదకులకు వెన్నెముక సమస్య వస్తోంది. తక్షణమే సంబంధిత అధికారులు కలగజేసుకుని గుంతలు పూడ్చాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మిస్టర్ ఇండియా పోటీల్లో మూడో స్థానం

తాడేపల్లి, న్యూస్‌టుడే : అసోంలోని గువహటిలో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన మిస్టర్ నార్త్ ఈస్టిండియా పోటీల్లో వరుణ్‌చౌదరి తృతీయ బహుమతి సాధించినట్లు కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థి అరుణ్‌చౌదరిని పలువురు ఆచార్యులు అభినందించారు.


వరుణ్ చౌదరి

విద్యార్థినులకు అభినందన


విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే : మండలంలోని పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు పలు చోట్ల జరిగిన పోటీల్లో విజయం సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు గురువారం అభినందించారు. చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో సీఎస్ఈ, సీఎస్ఐ విద్యార్థినులు విజయం సాధించారు. పేపర్ ప్రజెంటేషన్‌లోనూ ప్రథమ స్థానంలో నిలిచారు. పోస్టర్ ప్రజంటేషన్, టెక్ ప్రజెంటేషన్‌లలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. కళాశాల ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, సీఎస్ఈ హెడ్ రామస్వామి, ఏఐడీఎస్ విభాగాధిపతి చార్లెస్ జయరావులు విజయం సాధించిన వారికి బహుమతులు అందించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పంపిణీ

పెదవడ్లపూడి(మంగళగిరి), న్యూస్‌టుడే : మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో జాగృత భారత ట్రస్ట్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ స్కూల్‌ల్లోని 600 మంది విద్యార్థులకు చాకోబార్ పోషకాహారాన్ని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ గురువారం పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, నాగార్జున హైస్కూల్ డైరెక్టర్ జొన్నలగడ్డ రాఘవయ్య, తెదేపా గ్రామ అధ్యక్షుడు ఏళ్ల శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.


బాలలకు చాకోస్ పంపిణీ చేస్తున్న జవ్వాది కిరణ్‌చంద్

వ్యవసాయం కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) వ్యవసాయం కోర్సుల్లో అగ్రిసెట్ ద్వారా ప్రవేశాలకు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఈనెల 28 నుంచి 30 వరకు జరగనుందని వర్సిటీ రిజిస్ట్రార్ జి. రామచంద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ angrau.ac.in ని చూడాలని కోరారు.

పంటల బీమాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రబీలో సాగు చేస్తున్న రైతులను పంటల బీమాలో నూరు శాతం నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ద్వారా సమీక్షించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం రబీలో 2024-25లో పంటలు సాగు చేస్తున్న రైతులంతా ఇష్టపూర్వకంగా నిర్దేశించిన ప్రీమియం షేర్‌ను చెల్లించి పంటల బీమాలో నమోదు కావాల్సి ఉందన్నారు. ఇందుకు రైతులు ఆధార్, పొలం పత్రాలు లేదా సీసీఆర్‌సీ కార్డు, సాగు సర్టిఫికెట్, ఫోన్ నెంబర్, బ్యాంకు పాసు పుస్తకం అందించాలని, డిసెంబర్ 15లోగా నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ భార్గవ్‌తేజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సీపీవో శేషశ్రీ, ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం తరగతులు నిర్వహించొద్దు


ఎంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు అభిలాష్, భాగ్యరాజు ఎంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని వారు పేర్కొన్నారు.

బావిలో పడి బాలుడి గల్లంతు

తాడికొండ, న్యూస్‌టుడే : స్నేహితులతో ఈతకు వెళ్లిన బాలుడు బావిలో గల్లంతైన ఘటన పొన్నెకల్లులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పొన్నెకల్లు గ్రామానికి చెందిన ఓ బాలుడు(12) తన ఇద్దరు స్నేహితులతో కలిసి పంట పొలాల్లోని ఓ నేల బావిలో ఈతకు వెళ్లాడు. ముగ్గురూ బావిలో దూకారు. ఒకరు తిరిగి ఒడ్డుపైకి రాలేదు. బావిలో పూడిక ఉండటంతో అందులో ఇరుక్కుపోయాడు. తోటి స్నేహితుడు ఎంతసేపటికి బయటికి రాకపోవడంతో మిగిలిన ఇద్దరు భయంతో పారిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. బావి ఒడ్డున బాలుడి దుస్తులు చూసి గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందికి ఘటన గురించి తెలియజేశారు. వారు ప్రయత్నించినా బాలుడిని బావి నుంచి వెలికి తీయలేకపోయారు. గ్రామస్థులు ట్రాక్టర్ల ద్వారా బావి నీటిని తోడుతున్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డ కోసం గుండెలవిసేలా రోదిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం


గోకుల శ్రీనాథ్

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసుల వివరాల మేరకు.. రూరల్ మండలం అడవి తక్కెళ్లపాడు పరిధిలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో గోకుల శ్రీనాథ్(32) నివాసం ఉంటున్నారు. గతంలో నగరంలోని ఓ కొరియర్‌లో పనిచేశారు. కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన శ్రీనాథ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. స్థానికులు గుర్తించి నల్లపాడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వాసు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి సోదరుడు కోటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన సీపీఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు ట్రూఅప్ ఛార్జీల ఆలోచనను విరమించుకోవాలన్నారు. నవంబర్ 8 నుంచి 15 వరకు సీపీఎం ఆధ్వర్యంలో జరగనున్న ప్రజా పోరు ప్రచార యాత్రను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు డి. శ్రీనివాసరావు, రమేష్ బాబు, వెంకటశివరావు, రామారావు, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బారావు, యానాదులు, రాజేంద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు

బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

రేవేంద్రపాడు(దుగ్గిరాల), న్యూస్‌టుడే : రేవేంద్రపాడు వద్ద గురువారం ప్రైవేటు స్కూలు బస్సు ఢీకొని అదే గ్రామానికి చెందిన ధనకోటి వంశీకృష్ణ(18) మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. వంశీకృష్ణ కేఎల్‌యూలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. ఉదయం 8 గంటల సమయంలో రేవేంద్రపాడు కూడలి వద్దకు వచ్చారు. అక్కడ ప్రైవేటు స్కూలు బస్సు వెనక నుంచి ఢీకొట్టింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో మంగళగిరిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి రోజాపుష్ప ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటరవి కేసు నమోదు చేశారు.


మృతి చెందిన ధనకోటి వంశీకృష్ణ

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే : జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు గురువారం మృతిచెందారు. నల్లపాడు పోలీసుల వివరాల మేరకు.. రూరల్ మండలం బుడంపాడు సమీపంలో వృద్ధుడు(75) అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించారు. 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మరణించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదని వివరాలు తెలిసిన వారు నల్లపాడు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

విజ్ఞాన్ ఇండస్ట్రియల్ డైరెక్టర్‌కు అవార్డు



పాండా ప్రసాద్‌ను అభినందిస్తున్న లావు రత్తయ్య

పొన్నూరు: మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్-2024లో విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన ఇండస్ట్రియల్ డైరెక్టర్ పాండా ప్రసాద్ డ్రోన్ హ్యాకథాన్‌లో తృతీయ బహుమతితో పాటు రూ.50 వేలు నగదును సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు చేతులు మీదుగా అందుకున్నారని ఉపకులపతి పి.నాగభూషణ్ గురువారం వెల్లడించారు. పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, ప్రాజెక్ట్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంటు, పట్టణ అభివృద్ధికి డ్రోన్లను ఉపయోగించుకోవడానికి అత్యంత ప్రభావవంతమైన విధానాన్ని ప్రతిపాదించినందుకు ఈ అవార్డు లభించిందని వెల్లడించారు. డైరెక్టర్ ప్రసాద్‌ను విజ్ఞాన్స్ విద్యా సంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య ప్రత్యేకంగా అభినందించారు.

ఏఎన్‌యూలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సన్నాహాలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయలో విద్యార్థుల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నారు. వ్యాయామ విద్యా విభాగం సంచాలకులు ఆచార్య పాల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ఓపెన్ జిమ్ నిర్మించనున్నారు. రూ.4.50 లక్షలతో ఈ జిమ్‌ను సింథటిక్ ట్రాక్ పక్కనే ఏర్పాటుచేయనున్నారు. నెల రోజుల్లో విద్యార్థులు ఈ నూతన జిమ్ అందుబాటులోకి రానుందని ఉన్నతాధికారులు చెప్పారు.

సురేష్‌బాబు కళావేదిక ప్రారంభం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మన్స్ విభాగంలో డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన కళా వేదికను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ ప్రారంభించారు. ఈ కళా వేదిక ఏర్పాటుకు సహకరించిన సురేష్‌బాబును వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆచార్య ఎల్వీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

యువత.. కేరింత



మైమ్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, సినీ నటులు డాక్టర్ ముత్తవరపు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ విద్యతో పాటు ఇతర రంగాలలోనూ రాణించినప్పుడే అసలైన విజయం దక్కుతోందన్నారు. కళారంగంలో ఉన్న వారినే ఎక్కువ విజయాలు వరిస్తాయని, అవి సమాజాన్ని మేల్కొల్పుతాయని చెప్పారు. సినీ నటుడు సురేష్ బాబు మాట్లాడుతూ కృషి, పట్టుదల, నిజాయతీ ఉంటే విజయం మీ సొంతమవుతోందని చెప్పారు. రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, యువజనోత్సవాల సమన్వయకర్త ఆచార్య మురళిమోహన్ మాట్లాడారు. ప్రిన్సిపాళ్లు జాన్సన్, సిద్ధయ్య, ప్రమీలారాణి, ఆచార్యులు ఎన్వీ కృష్ణారావు, ధనలక్ష్మి, మాధవి, త్రిమూర్తి రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటారు.. యువజనోత్సవాలలో విద్యార్థులు దుమ్ములేపారు. తమలో దాగి ఉన్న కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. సంప్రదాయ, జానపద నృత్యాలతో సందడి చేశారు. చిత్రలేఖనం, మైమ్స్, వాయిద్యాలతో కదం తొక్కారు. భరత నాట్యంతో విద్యార్థినులు అలరించారు. సంగీతం, థియేటర్ ఆర్ట్స్‌లో పోటీపడి ప్రదర్శనలు ఇచ్చారు. మేకప్, వస్త్రధారణ, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్స్‌తో సందడి చేశారు. పోస్టర్ మేకింగ్, స్పాట్ పెయింటింగ్‌లతో సత్తాచాటారు.



వాయిద్యాలు వాయిస్తూ..

సాంకేతిక మార్పును గమనించాలి

పెదకాకాని, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ రంగంలో సాంకేతిక మార్పును గమనిస్తూ దాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ముందుకు సాగాలని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీ, జీఎస్టీ కమిషనర్ ఎం.రమణారెడ్డి తెలిపారు. నంబూరు వీవీఐటీలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి సాంకేతిక సదస్సును ఆయన ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగనుంది. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంటు ఆపరేషన్స్ ప్రెసిడెంటు ఎంవీ చారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'మతోన్మాద రాజకీయాలకు ప్రభుత్వం ఊతం'



సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శంకర్, బంగార్రావు, రామ్‌దేవ్

తెనాలి (కొత్తపేట): హిందూ దేవాలయాల వ్యవహారాల్లో తమ జోక్యం ఉండకూడదని జీవో తెచ్చి రాష్ట్రంలో మతోన్మాద రాజకీయాలకు ప్రభుత్వం ఊతమిస్తోందని సీపీఐ ఎం.ఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్ ఆరోపించారు. ఆయన గురువారం తెనాలి పట్టణం చినరావూరు సామాజిక భవనంలో నిర్వహించిన ఆ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పి.రామ్‌దేవ్ అధ్యక్షత వహించారు. జగన్‌రెడ్డి కేసుల భయంతో ప్రధాన సమస్యలు లేవనెత్తలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని ఆయన విమర్శించారు. డిసెంబరు 4న విజయవాడలో నిర్వహించే ప్రజల ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. తాలుక శంకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారావు, రామ్‌దేవ్ ఆచార్య సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

26, 27 తేదీల్లో తైక్వాండో పోటీలు

తెనాలి టౌన్: ఈ నెల 26, 27 తేదీల్లో తెనాలిలో రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు కేఎస్‌ఆర్ తైక్వాండో అకాడమీ గురువు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. స్థానిక వైశ్య వ్యాయామ మందిర్ వేదికగా ఈ పోటీలు ఉంటాయని వివరించారు. ఈ మేరకు పోటీల బ్రోచర్‌ను పట్టణంలో ఈదర వెంకటపూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ, చంటి, బాలు, రోహిత్‌వర్మ ఆవిష్కరించారు.

740 అర్జీలు సమర్పణ

కొల్లిపర: ఎమ్మెల్సీ ఓటు కోసం మండల పరిధిలో 740 అర్జీలు సమర్పించారని కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థ గురువారం తెలిపారు. అర్హులైన పట్టభద్రులు అర్జీలు సమర్పించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణానికి అనుమతి

కొల్లిపర: వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవటం ఇప్పుడు మనవంతని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం ఉపాధి హామీ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. మండల పరిధిలో 250 ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చిందని తెలిపారు.

తెదేపా కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం

పెదకాకాని: పెదకాకానిలో బుధవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందిన తెదేపా కార్యకర్త శొంఠి గోపి(34) మృతదేహానికి గురువారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సందర్శించి నివాళులు అర్పించారు. పార్టీ తరఫున అండగా నిలుస్తామని మృతుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన



పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా పట్టణ మారీసుపేటలోని ఎన్ఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రైల్వే ఎస్సై వెంకట్రాద్రి పోలీస్ విధులపై అవగాహన కలిగించారు. సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గురువారం తెనాలి రైల్వే పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

జగన్‌కు శవరాజకీయాలు బాగా అలవాటు: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి సవిత

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: 'జగన్‌మోహన్ రెడ్డికి తొలి నుంచి శవరాజకీయాలు బాగా అలవాటు. తండ్రి చనిపోతే బాధపడలేదు. శవం వద్ద కుర్చొని సంతకాలు పెట్టించుకున్నాడు. హూ కిల్డ్ బాబాయ్. ఇకనైనా శవరాజకీయాలు మానుకోవాలి' అని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. గుంటూరులో గురువారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఆయన ఏం చేశాడని, ఇటీవల జరుగుతున్న అత్యాచారాలకు వైకాపా ప్రభుత్వం చేసిన అరాచకాలే కారణమని, రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ మాఫియాగా మార్చేశారన్నారు. నవరత్రాల పేరుతో రాష్ట్రాన్ని దోచుకోవడం, దాచుకోవడం చేశారని విమర్శించారు. కర్నూలులో వారి దౌర్జన్యాలకు ఓ కుటుంబం రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకుందని గుర్తుచేశారు. గత ఐదేళ్లల్లో 2,027 మంది మహిళలపై దారుణాలు జరిగాయని వారికి ఏ న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 74 మందిపై అత్యాచారాలు జరిగాయని అంటున్నారు? వాటిపైన చర్చకు జగన్ సిద్ధమా అని నిలదీశారు. తన ఇంట్లోని తల్లి, చెల్లెల్ని ఆయన పట్టించుకోలేదన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్తా, కోడళ్లపై జరిగిన దారుణంలో వెంటనే ఆరుగురిని, బద్వేల్‌లో యువతికి నిప్పుపెట్టిన వెంటనే కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మహిళల పక్షపాతి అయిన సీఎం చంద్రబాబునాయుడు మహిళలపై నేరాలు జరగకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు? తప్పు ఎవరు చేసినా, ఏ పార్టీవారైనా కఠినంగా శిక్షించాలని, బాధితులకు నష్టపరిహారం ఇచ్చేలా ఆదేశించడంతోపాటు అమలు చేస్తున్నారని వివరించారు. నేరస్థులకు శిక్షలు పడేలా ఫాస్టుట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు.


26 నుంచి తెనాలిలో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్



క్రీడా పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, నిర్వాహక ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తెనాలి క్రీడా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ బ్రోచర్‌ను రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్థానిక తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు హాజరవుతారని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.రవి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్.వినయ్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు, నాగరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం నివాసం వద్ద కొండచిలువ కలకలం



తాడేపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం సమీపంలోని మీడియా పాయింట్ వద్ద గురువారం కొండచిలువ చనిపోయి కనిపించింది. చుట్టుకుని ఉండటంతో దానిని చూసిన వారంతా ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని మీడియా పాయింట్‌లోని ప్రతినిధులు సీఎం భద్రతా సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. ఏదో గుర్తుతెలియని జంతువును మింగిన కొండచిలువ కదల్లేని పరిస్థితుల్లో చనిపోయిందని భావిస్తున్నారు. భద్రతా సిబ్బంది దానిని పరిశీలించి అక్కడ నుంచి తొలగించారు.

ఉచితంగా సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు, వైద్య నిపుణులు

ఈనాడు, విశాఖపట్నం: యూకేకు చెందిన హీలింగ్ లిటిల్ హార్ట్స్, మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో 32వ ఉచిత పిల్లల గుండె శస్త్రచికిత్సల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు పేర్కొన్నారు. కేజీహెచ్ సమీపంలోని ఆంధ్రా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఈ నెల 21 నుంచి 26 వరకు 15 సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 9 మంది చిన్నారులకు శస్త్రచికిత్స పూర్తయ్యింది. విశాఖలో రెండోసారి ఈ శిబిరం నిర్వహిస్తున్నాం. తొమ్మిదేళ్లలో విజయవాడ, విశాఖలోని ఆంధ్ర హాస్పిటల్స్‌లో 4000 గుండె శస్త్రచికిత్సలు జరిగాయి. వాటిలో అధిక శాతం ఎన్టీఆర్ వైద్యసేవ, మహేష్‌బాబు ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో ఉచితంగా చేసినవే. ఆంధ్ర హాస్పిటల్స్ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాలజీ, నవజాత శిశువులు, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందాలు కలసికట్టుగా పనిచేయడంతో ఇది సాధ్యపడింది. రాబోయే రోజుల్లో ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి ఈ శిబిరం నిర్వహిస్తాం' అని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర హాస్పిటల్స్ వైద్య నిపుణులు రేవంత్, విక్రమ్, రవీంద్ర దేవ్, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, పద్మావతి తదితరులు మాట్లాడారు. యూకేకు చెందిన వైద్య నిపుణులు సిమోన్, స్నిగ్ధ పడ్వాళ్వార్, శరన్ దురైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల విలువైన నకిలీ సిగరెట్ల పట్టివేత

పట్నంబజారు: ఫిరంగిపురం మండలం నుదురుపాడు సమీపంలో గురువారం సెంట్రల్ జీఎస్టీ అధికారులు తనిఖీ చేసి ఓ లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న సిగరెట్లను గుర్తించారు. అధికారులకు అనుమానం వచ్చి లారీ డ్రైవర్ వద్ద ఇన్‌వాయిస్‌ను పరిశీలించగా 2.77 లక్షల అగ్గిపెట్టెలు రవాణా అవుతున్నట్లు రాసి ఉంది. లారీలోని 46 పాలీ బ్యాగులను అధికారులు తెరచి చూడగా, వాటిలో మొత్తం 11,04,000 సిగరెట్లు ప్యాకెట్లు ఉన్నట్లు తనిఖీలో వెల్లడైంది. సిగరెట్ల ప్యాకెట్లు అన్ని అగ్గిపెట్టె ప్యాకెట్లను పోలి ఉన్నాయి. సిగరెట్లను ఇన్‌వాయిస్‌లో చూపకుండా పన్ను ఎగవేతకు పాల్పడుతున్న రవాణా చేస్తున్నట్లు గుర్తించి సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. సిగరెట్ల ప్యాకెట్లపై ఉన్న ఎంఆర్‌పీ ప్రకారం వాటి మార్కెట్‌లో విలువ దాదాపు రూ.50 లక్షలు పైగానే ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. తయారు, ముగింపు తేదీలు లేని కారణంగా వాటిని నకిలీ బ్రాండెడ్ సిగరెట్లుగా అధికారులు తేల్చారు. జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అధికారులు బి.లక్ష్మీనారాయణ, జి.రవికుమార్, ఎం.నాగరాజు, గాదె శ్రీనివాసరెడ్డి, నవీన్‌రాజు, యుగంధర్ తనిఖీలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొల్లిపర, న్యూస్‌టుడే: మండలంలోని చివలూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. తూములూరుకు చెందిన వింతా మహేశ్వరరెడ్డి (40) తెనాలి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. చివలూరు సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డు మరమ్మతుల పనుల్లో భాగంగా దారి పక్కన పోసిన కంకరుగుట్ట కనిపించకపోవటంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

27.5 కేజీల గంజాయి స్వాధీనం




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పొన్నూరు గ్రామీణ సీఐ కోటేశ్వరరావు

చేబ్రోలు: నలుగురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో పొన్నూరు గ్రామీణ సీఐ కోటేశ్వరరావు గురువారం నిందితుల వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పొన్నం మండలం నవనంపాడుకు చెందిన రాజా, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా మౌపోదర్‌కు చెందిన సంతోష్ గౌడ్ చేబ్రోలు సమీపంలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పని చేసేందుకు వచ్చారు. వారికి గంజాయి తాగే అలవాటు ఉండటంతో వట్టిచెరుకూరు మండలం ముట్లూరుకు చెందిన గంజాయి విక్రేత థామస్‌పాల్‌తో పరిచయం ఏర్పడింది. ఒడిశా నుంచి గంజాయిని తీసుకు వచ్చి విక్రయిస్తే అదనపు ఆదాయం వస్తుందనే ఆశతో ముగ్గురు కలిసి 10 రోజుల కిందట అక్కడ అటవీ ప్రాంతం నుంచి 27.5 కేజీల (రూ.5 లక్షల విలువ) గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చారు. బుధవారం సాయంత్రం గంజాయి విక్రేతలైన పొన్నూరుకు చెందిన షేక్ ఫజిల్, నారాకోడూరుకు చెందిన వెలగా విజయ్‌సాయి, ఒడిశాకు చెందిన ప్రశాంత్‌మాలిక్‌తో కలిసి పై ముగ్గురు చేబ్రోలులో గంజాయి పంచుకుంటుండగా.. పొన్నూరు సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్సై వెంకట కృష్ణ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. విజయ్‌సాయి, ప్రశాంత్ మాలిక్ పారిపోగా మిగిలిన నలుగురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. థామస్ పాల్, ఫజిల్, విజయసాయిలపై గతంలో గంజాయి కేసులున్నాయని చెప్పారు. ఈ కేసులో బాగ పనిచేసిన కానిస్టేబుళ్లు అభిలాష్ ప్రసాద్, రాము, నాగరాజులను సీఐ అభినందించారు.

మహిళలకు ఉచిత ప్రయాణం హామీ అమలు చేయాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్‌పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు డిమాండ్ చేశారు. ఆయన గురువారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో బస్సు ఎక్కి ప్రయాణం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగ సూర్య శశిధరరావు, జిల్లా కార్యదర్శి యన్నంశెట్టి శివరామకృష్ణ ప్రసాద్, మండల అధ్యక్షుడు కర్లపూడి బుల్లెయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక కేంద్రాలు



రైతుకు ప్లాట్ల కేటాయింపు పత్రాలు అందిస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్

తుళ్లూరు, న్యూస్‌టుడే : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఏపీ సీఆర్డీఏకు భూ సమీకరణ పథకంలో భూములు ఇచ్చిన రైతులకు (గతంలో కేటాయించని వారికి) రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపునకు రెండో రోజు గురువారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో లాటరీ నిర్వహించారు. కార్యక్రమంలో 9 రాజధాని గ్రామాలకు చెందిన 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లు అందజేశారు. రైతులకు త్వరితగతిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుగా ప్రభుత్వం 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్ల ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పొందిన రైతులు సంబంధిత కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ బి.ఎల్.ఎన్ రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.డేవిడ్‌రాజు, జి.భీమారావు, కె.స్వర్ణమేరి, జి.సాయి శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో /కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, రిటైల్ ధర - 150, చికెన్ విత్‌స్కిన్ - 218, చికెన్ స్కిన్‌లెస్ - 248.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, 142, 153 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

తెనాలి

• తెనాలి • పొన్నూరు

రైల్వే గేటు మూసివేతతో ఇబ్బందులు

వేజండ్ల (చేబ్రోలు), న్యూస్‌టుడే: వేజండ్ల గ్రామానికి వెళ్లే దారిలోని రైల్వే గేటు ముందస్తు సమాచారం లేకుండా మూసివేయడంతో గురువారం స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్సీ కాలనీలో 2వేల మంది జనాభా ఉన్నారు. వైద్యశాల, పాఠశాల, పంచాయతీ, సచివాలయం అన్ని గ్రామంలోనే ఉండటంతో అందరూ సుద్దపల్లి మీదుగా తిరిగి వెళ్లాల్సి వచ్చిందని వాపోయారు. రైలు పట్టాల వద్ద మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో రెండు రోజులు పాటు గేటు మూసి వేశామని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

చేబ్రోలు, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాహితి అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కె.లలిత ప్రకటనలో తెలిపారు.

మంత్రి మనోహర్‌కు అర్జీలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక శాసనసభ్యులు, మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలతో పాటు వివిధ వివాదాలకు సంబంధించిన అర్జీలను ప్రజలు ఆయనకు అందించారు. ఓఎస్‌డీ ఏసు రత్నం, సిబ్బంది ఉన్నారు.



పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు





ప్రతిభకు పదును

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని కేకేఆర్ గౌతమ్ ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై 8,9,10 తరగతుల విద్యార్థులు వ్యాస రచనల ద్వారా తమ అభిప్రాయలను పంచుకున్నారు. యశ్వంత్ సాయి (పదో తరగతి) ప్రథమ, జయశంకర్ (తొమ్మిదో తరగతి) ద్వితీయ, జ్యోతినాథ్ (ఎనిమిదో తరగతి) తృతీయ స్థానాల్లో నిలువగా బ్రాంచి ఇన్‌ఛార్జి అవుతు సుధాకర రెడ్డి విజేతలను అభినందించి బహుమతులు అందించారు. హెచ్‌వోడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు కమల్‌సాయి పాల్గొన్నారు.

ఉత్సాహంగా..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ పరిధి గంగానమ్మపేటలోని నారాయణ ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో 8,9,10 తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు షేక్ మోహసిన్, టి.సంతోష్‌కుమార్, పి.మౌనశ్రీ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ నన్నపనేని నాగలక్ష్మి విజేతలను అభినందించి బహుమతులు అందించారు. ఏవో రఘునాథ్, డీన్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

అమరావతి కాలనీ, సుల్తానాబాద్ వాసుల అవస్థలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణంలోని అమరావతి కాలనీ, సుల్తానాబాద్‌లోని బీటీ రోడ్లు గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ఐదేళ్లగా పూడ్చకుండా వదిలేసిన గుంతల మీదుగా ప్రయాణం నరకప్రాయంగా మారింది.

వార్డులు:	29,30
జనాభా:	8,995
కుటుంబాలు:	2,650

ప్రధాన కాలువల్లో మురుగు ముందుకు కదలకపోవడంతో పొంగి ఖాళీ స్థలాల్లోకి చేరుతున్నాయి. ఇవి పందులు, దోమల ఆవాసాలుగా మారడంతో కంటి మీద కునుకు కరవైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు ఈ ఏరియాలో కుక్కలు, పందులు ఉన్నాయి తస్మాత్ జాగ్రత్త అని రాయించి ఫ్లెక్సీలు ప్రదర్శించడం గమనార్హం.

☛ ఈ ప్రాంతాల్లో పక్కా కాలువల నిర్మాణం, పూడికతీత పనులు సకాలంలో పూర్తి చేయక, కుళాయిలు ఇవ్వక ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని జిల్లా ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి మందగించింది.



కోసుకుపోయిన ఆలపాటి నగర్ రోడ్డు



అమరావతి కాలనీలో కుక్కలు ఉన్నాయి జాగ్రత్త ఫ్లెక్సీ

జిల్లా ఆసుపత్రిలో రోగులకు రూ.80కే భోజనం అందించాలని ధరలు సవరించిన జీవో వచ్చింది. అధికారులు ఎంపిక చేసిన టెండర్‌దారుడు రూ.39లకే అల్పాహారం, రెండు పూటల భోజనం రోగులకు అందిస్తున్నట్లు దస్త్రాల్లో పేర్కొనడం గమనార్హం. దీంతో రూ.80 భోజనం అందడంలేదని రోగులు వాపోతున్నారు. డైట్, పారిశుద్ధ్యం కాంట్రాక్టు పనుల గడువు ముగిసినా టెండర్లు పిలవకుండా ఉండడంపై రోగులు మండి పడుతున్నారు. వీటిపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించాలని కోరుతున్నారు.

అపార్ట్‌మెంట్లకు కుళాయిలు ఇవ్వలేదు



ఖాళీ స్థలాల్లోకి మురుగు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. వ్యక్తిగత గృహాలకు కుళాయిలు ఇచ్చారు. అపార్ట్‌మెంట్లకు ఇవ్వలేదు. ప్రధాన కాలువలో మురుగు దిగువకు పోతేనే పక్కా కాలువల్లో పారుదల అవుతుంది.

-సుందరరావు, అమరావతి కాలనీ

అర్చకులపై విచారణ

పొన్నూరు, న్యూస్‌టుడే: స్థానిక భావనారాయణ స్వామి దేవాలయంలో విధులు నిర్వహిస్తున్న కొందరు అర్చకులు మహిళా భక్తుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం జిల్లా దేవాదాయశాఖ అధికారి కేబీ.శ్రీనివాస్ రహస్యంగా విచారణ చేపట్టి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. అర్చకులను విచారించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దేవాలయంలో నిర్వహించిన కుంభాభిషేకానికి సంబంధించిన జమ ఖర్చులతో పాటు, దేవాదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతి పత్రాలు అడిగినట్లు తెలిసింది. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని అధికారి వెల్లడించారు.

జస్టిస్ పున్నయ్య కమిషన్ అమలు చేయండి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: 2014లో మాదిరిగా జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను రాష్ట్రంలో అమలు చేయాలని కేవీపీఎస్ (కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆయన గురువారం తెనాలిలో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన మదిర సహాన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు, ఐదెకరాల పొలం, ఇల్లు, ఇళ్ల స్థలం, సోదరీమణుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్భయ చట్టం అమలు చేసి నిందితుణ్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలన్నారు. సీపీఎం కార్యదర్శి కె.బాబూప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, ఎన్.రాజ్యలక్ష్మి, పి.జోసేష్, యంగ్రపాటి అశోక్, జాకబ్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? సుల్తానాబాద్ ఆలపాటి నగర్‌లో పందుల బెడద విపరీతంగా ఉంది. పెంపకందారులు వాటిని ఇక్కడకు తెచ్చి వదిలేస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదు. **-రాధాకృష్ణ, ఆలపాటి నగర్**

✔ స్థానిక సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కార చర్యలు తీసుకుంటాం. **-బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్**

? మారీసుపేట రావివారి వీధిలో రోడ్డు వెంబడి చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలపైకి చేరాయి. గాలి వచ్చినప్పుడల్లా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. **-ఆంజనేయులు, మారీసుపేట**

✔ కొమ్మలను తొలగింపు చేస్తాం.

-అశోక్‌కుమార్, విద్యుత్తు విభాగ డీఈ, తెనాలి.

–న్యూస్‌టుడే, తెనాలి టౌన్

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. శృంగారపేటలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

-న్యూస్‌టుడే, పొన్నూరు

నేడు తెదేపా నియోజకవర్గ సర్వసభ్య సమావేశం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక ఎన్‌వీఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు తెదేపా నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ గురువారం తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరవుతారని, ఈ నెల 26వ తేదీ నుంచి జరుగనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై చర్చిస్తారన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సినిమా పోస్టర్ విడుదల

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆయన ఛాంబర్లో విడుదల చేసినట్లు మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా ప్రకటనలో తెలిపారు.

రేషన్ డీలర్లు చిత్తశుద్ధితో పని చేయాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: రేషన్ డీలర్లు అవినీతి అక్రమాలకు పాల్పడకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని, లేని పక్షంలో తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ వెల్లడించారు. గురువారం పొన్నూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల నుంచి జొన్నలను పంపిణీ చేసేలాతగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎండీయూ వాహనదారులు సమయ పాలన పాటించాలని కోరారు.

వివాహిత అదృశ్యం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: భర్తతో వాగ్వాదం జరిగిన నేపథ్యంలో బాలాజీరావుపేటకు చెందిన 45 సంవత్సరాల మహిళ ఈ నెల 21న ఇంటి నుంచి వెళ్లి ఈ రోజు వరకు తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఉప్పలపాడులో చోరీ

పెదకాకాని, న్యూస్‌టుడే: ఉప్పలపాడు గ్రామంలో ద్రోణాదుల మల్లేశ్వరి ఒంటరిగా నివసిస్తున్నారు. స్థానికంగా నివాసముంటున్న తన కుమార్తె రమణ ఇంటికి బుధవారం రాత్రి నిద్రించేందుకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా తలుపునకు వేసిన తాళం పగులకొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచుకున్న రూ.50 వేలు నగదు అపహరణకు గురైంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

కళ్లల్లో కారం కొట్టి..

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలు సాతానువారి వీధికి చెందిన నర్సమ్మ ఎస్‌బీఐ బ్యాంకు వద్ద తోపుడు బండిపై పూలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే పూలు అమ్ముకుని బండిని తోసుకుంటూ ఇంటి వద్దకు చేరే సరికి గురువారం రాత్రి యాక్టివా వాహనంపై ముఖానికి మాస్కు పెట్టుకుని ఓ యువతీ యువకుడు వచ్చి పూలు కొనుగోలు చేశారు. ఆ ప్రాంతంలో వీధి దీపాలు వెలగక చీకటిగా ఉండడంతో నర్సమ్మ ముఖంపై కారం చల్లి మెడలోని గొలుసు లాక్కునే ప్రయత్నించారు. ఆమె ప్రతిఘటించడంతో గొలుసుకు ఉన్న లాకెట్ లాక్కుని పారిపోయారు. బాధితురాలు పోలీసుకు ఫిర్యాదు చేసింది.

చినరావూరుతోటలో ఘర్షణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: చినరావూరు తోటలో గురువారం స్థానికుల నడుమ జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. ఇరువురు ఒకరిపై మరొకరు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు

గుంటూరు తూర్పు



వ్యాసం రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న యాదవ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.రాజ్యలక్ష్మి

ప్రతిభా పరీక్షలు.. భవితకు సోపానాలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాత గుంటూరులోని యాదవ హైస్కూల్‌లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాలం వినియోగంతో కలిగే లాభాలు, నష్టాలు - విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఎ.వెంకట సుమాంజలి, కె.సిరి, టి.ప్రసన్నలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను యాదవ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.రాజ్యలక్ష్మి అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్.వెంకట్రావు, రత్నాకర్, జి.ఆంటోనీ పాల్గొన్నారు.

జీఎంసీ కమిషనర్‌తో 'ఈనాడు ఫోన్ ఇన్' రేపు

✤ ప్రజలు తెలియజేయాల్సిన నంబరు: 0863- 2224202



కమిషనర్ పులి శ్రీనివాసులు

నగరపాలక సంస్థ పరిధిలోని 57 డివిజన్లల్లో నెలకొన్న స్థానిక సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేందుకు వీలుగా 'ఈనాడు ఫోన్ ఇన్' శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించనుంది. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదార్ల, కాల్వల పూడికతీతలు, వీధిదీపాలు వంటి సమస్యలను నేరుగా జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టికి తీసుకుని రావచ్చు. సదరు సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

– న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు)

శివారు ప్రాంతాలపై చిన్నచూపు



సీతమ్మకాలనీ నుంచి నల్లపాడు వెళ్లే రోడ్డులో పడేసిన వ్యర్థాలు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ అధికారులు ప్రతి సోమవారం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించడమేగానీ పరిష్కారానికి నోచుకున్నవి అంతంత మాత్రమేననే విమర్శలు వస్తున్నాయి. శివారు ప్రాంతాల నుంచి వస్తున్న సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు చెప్పి చేతులు దులుపుకోవడమే గానీ తర్వాత వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పలు శివారు ప్రాంతాల్లో స్థానికులు పలు సమస్యలతో అవస్థలు పడుతున్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో వార్డు సచివాలయం కార్యదర్శులకు అధికారులు బాధ్యతలు ఇచ్చారు. వారు గుర్తించిన సమస్యలను పరిష్కరించాల్సి ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు.

వర్షం పడితే చిత్తడే..

తూర్పు నియోజకవర్గంలోని సాయినగర్ రెండోలైన్ ఒమెగా ఆసుపత్రి క్యాంటీన్ రహదారిలో పలు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ రహదారి మట్టి రోడ్డు కావడంతో వర్షం కురిస్తే చిత్తడిగా మారుతోంది. రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురయ్యారు. విషయాన్ని స్థానికులు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు అందజేశారు. కానీ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు

పశ్చిమలోని పలకలూరు రోడ్డు రత్నగిరినగర్‌లో గత వారం రోజులుగా తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఉద్యోగనగర్ రిజర్వాయర్ వద్దకు వెళ్లి సిబ్బందికి తెలియజేస్తే సరైన సమాధానం చెప్పకపోగా దురుసుగా ప్రవర్తిస్తూ.. ఎవర్నికైనా చెప్పుకోండి, పై నుంచే తాగునీరు సరఫరా లేదని దాటవేస్తున్నారని రత్నగిరినగర్ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా రహదారి

వెంకటరమణ కాలనీ వెనుకగా ఉండే సీతమ్మకాలనీ ఎక్స్‌టెన్షన్ నుంచి నల్లపాడుకు వెళ్లే రోడ్డును ఇటీవల డంపింగ్ యార్డులా మార్చుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు చెత్త, వ్యర్థాలను తెచ్చి ఈ రహదారిలో పడేయడంతో ఇటుగా రాకపోకలు చేసేవారు అవస్థలు పడుతున్నారు. విషయాన్ని ప్రజారోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా శివారు కాలనీల్లోని సమస్యల పరిష్కారంపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య ఇతర విభాగాల అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

✤ రైలుపేట ప్రధాన రోడ్డులో కాల్వల్లో తీసిన సిల్ట్‌ను అలాగే వదిలేయడం వలన పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ సిల్ట్ కుప్పలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ✤ లాలాపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యర్థాల్ని తొలగించడం లేదని స్థానికుల 'మేమున్నాం... మీకుతోడుగా' ద్వారా సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన అధికారులు వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ✤ ఆర్టీసీ కాలనీ అంతర్గత రహదార్లలోని సైడు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు పారుదల అవ్వక దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్య శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ కార్మికులను పంపి కాల్వల్లో పూడికలు తీయించారు.

– న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు), పట్నంబజారు

25, 26న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభ

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా 37వ మహాసభ ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ తెలిపారు. గురువారం కొత్తపేటలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభ సందర్భంగా 25న ఉదయం 10 గంటలకు 1000 మంది విద్యార్థులతో నగరంలో ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గోడప్రతులను ఆవిష్కరించారు. సమావేశంలో నగర అధ్యక్ష కార్యదర్శులు సాయి, యశ్వంత్, నాయకులు పాల్గొన్నారు.

సత్రం ఆస్తుల పరిరక్షణకు చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి సవిత

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం బ్రాహ్మణులకు పూర్వవైభవం తీసుకువస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం ఆమె ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు చెందిన యడవల్లివారి సత్రాన్ని సందర్శించారు. సత్రం స్థలంలోని పాఠశాల ప్రాంతం, కూల్చివేసిన సినిమా థియేటర్ల స్థలాలను పరిశీలించారు. సత్రం ఆస్తుల రికార్డులను పరిశీలించారు. సత్రం ఆస్తులు గతంలో అన్యాక్రాంతమవ్వడం, కోర్టు కేసులు, స్థలంలోని నగరపాలకసంస్థకు చెందిన పాఠశాల నిర్వహణ, ఆ స్థల విషయమై కొన్నేళ్లుగా సత్రం అధికారులకు, నగరపాలక సంస్థకు మధ్య వివాదం నడుస్తున్న అంశాలపై మంత్రి అధికారులతో, బ్రాహ్మణ సంఘాల నాయకులతో సమీక్షించారు. మంత్రి అక్కడ నుంచి కలెక్టర్ నాగలక్ష్మికి ఫోన్ చేసి సత్రం అధికారులు, జీఎంసీ అధికారులతో మాట్లాడి పాఠశాల స్థల వివాదాన్ని పరిష్కరించాలన్నారు. సత్రం కన్వీనర్, సహాయ కమిషనర్ టి.సుభద్ర, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ పూర్వపు సమన్వయకర్త శ్రీధర్‌శర్మ, ఎండీ మహేశ్వరరెడ్డి, జీఎం నాగసాయి ఉన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు శిబిరం



ఓటరు నమోదు దరఖాస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: పట్టభద్రులు అందరూ మళ్లీ ఓటరుగా నమోదు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్స్, సిబ్బందికి గురువారం పట్టభద్రుల ఓటరు నమోదు శిబిరం నిర్వహించారు. వారికి ఓటరు నమోదు దరఖాస్తులు అందజేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని, ప్రజలకు ఎంతో మంచి చేసిందన్నారు. త్వరలో జరగబోయే గుంటూరు-కృష్ణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఆయన్ని శాసనమండలికి పంపితే గ్రాడ్యుయేట్ల సమస్యలు పరిష్కరించడంలో ముందు ఉంటారన్నారు. కార్పొరేటర్ పోతురాజు సమత, తెదేపా నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, గోళ్ల ప్రభాకర్, ఎల్లావుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు శ్వాసపరీక్షలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో గురువారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు వాహన చోదకులకు శ్వాసపరీక్షలు నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో తూర్పు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, ఎస్సై రవీంద్ర సిబ్బందితో కలిసి డొంకరోడ్డు వద్ద శ్వాసపరీక్షలు చేశారు.

పిల్లల అభిరుచులను గుర్తించి ప్రోత్సహించాలి

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులను గుర్తించి ప్రోత్సహించాలని ఐఆర్ఎస్ అధికారి దూనేపూడి మధుబాబు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్నారై అవ్వారు ప్రకాష్ సౌజన్యంతో తుఫాన్‌నగర్‌లోని కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు గురువారం క్రీడా పరికరాలు అందజేశారు. మానవత కార్యదర్శి సతీష్, వైస్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, మానవత సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

నగరపాలకసంస్థ: జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల 27వ తేదీన గుంటూరు హిందూ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో జరుగుతాయని జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు అన్నారు. గురువారం బ్రాడీపేట యూటీఎఫ్ హాల్‌లో సైన్స్ సంబరాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేవీవీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సహాన కుటుంబాన్ని ఆదుకోండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: తెనాలికి చెందిన సహాన మృతి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, నగర అధ్యక్షురాలు రాధ అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సహాన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఐద్వా నగర కార్యదర్శి కల్యాణి, నాయకులు పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనాలు కేటాయించాలి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో ప్రతి శానిటరీ డివిజన్‌కు చెత్త తరలింపు వాహనాలు అవసరాల మేరకు కేటాయించాలని కమిషనర్ శ్రీనివాసులు ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ కేవీపీ కాలనీలోని వెహికల్ షెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. సిబ్బందికి ఎన్నిసార్లు పనితీరు మార్చుకోవాలని చెబుతున్నా మార్పు కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అదనపు కమిషనర్, సీఎంవోహెచ్, ఎంహెచ్‌వో, ఇతర ప్రజారోగ్య అధికారులతో సమావేశమై పారిశుద్ధ్య పనులు మెరుగ్గా జరగాలన్నారు. సచివాలయాల వారీగా మరమ్మతుకు గురైన పుష్‌కార్ట్స్‌ని వెహికల్‌షెడ్‌కు తీసుకురావాలని, వాటిని రెండు రోజుల్లో మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు, సీఎంవోహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు ఉన్నారు.

సేవలు అభినందనీయం



ఆర్ఐలు శ్రీనివాసరావు, బ్రహ్మానందంతో ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)లుగా పనిచేసిన శ్రీనివాసరావు, బ్రహ్మానందం బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్తున్న సందర్భంగా గురువారం పోలీసు కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఇద్దరు ఆర్ఐలను ఎస్పీ సత్కరించి వారి సేవలను ప్రశంసించారు. ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీలు శాంతకుమార్, సీతారామయ్య, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని పశ్చిమ డివిజన్ డీఎస్పీ జయరాం ప్రసాద్ అన్నారు. గురువారం నగరంపాలెంలో వారధి కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఏటీఎం కేంద్రాల వద్ద గుర్తుతెలియని వ్యక్తులకు పిన్ నంబర్ చెప్పకూడదన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులను క్లిక్ చేయకూడదని తెలిపారు. నగరంపాలెం సీఐ వీరానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నిఘానేత్రాలు ఏర్పాటు చేయండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లలో నిఘానేత్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్పీ తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో, నేర పరిశోధనలో నిఘానేత్రాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కూడళ్లలో కొత్తగా నిఘానేత్రాలు ఏర్పాటు చేయడంతోపాటు గతంలో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. దుకాణాలు, ఇంటి పరిసరాల్లో నిఘానేత్రాలు ఏర్పాటు చేసుకోవడంతో భద్రత లభిస్తోందని సూచించారు.

కవలల ప్రాణాలు కాపాడిన సీఎం సహాయ నిధి

ఎన్టీఆర్‌సర్కిల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి కవలల ప్రాణాలు కాపాడిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం బాధితులు మాట్లాడుతూ ఇందిరా కాలనీకి చెందిన సయ్యద్ జాహిద్ హుస్సేన్ జీనాబి దంపతులకు రెండు నెలల కిందట జన్మించిన కవలలు అనారోగ్యం పాలయ్యారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అధిక మొత్తంలో ఖర్చులు అవ్వగా అప్పులు చేయాల్సి వచ్చిందని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,85,000 మంజూరు చేయించి ఆదుకున్నారన్నారు. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే నసీర్ వారికి అందజేశారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బసవలింగారావు, పక్కన మహమ్మద్ ఖాలీద్ తదితరులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ కాలం ఏడాది దాటినా ఇప్పటి వరకు ఐఆర్(మధ్యంతర భృతి) ప్రకటించలేదని, వెంటనే ఐఆర్ ప్రకటించి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.బసవలింగారావు డిమాండ్ చేశారు. గురువారం నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బసవలింగారావు మాట్లాడుతూ. . 2023 జులై 1 నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాలని, ఇంత వరకు కమిషన్ ఛైర్మన్‌ను నియమించలేదన్నారు. డీఏ(కరవు భత్యం) మొత్తం 90 నెలలు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేసినవారు అధిక సంఖ్యలో ఉన్నందున సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉన్నత పాఠశాలల్లో అధికంగా ఉందని, ఎంఈవో పోస్టులు ఖాళీలను, ఆగిపోయిన నెలవారీ ఉద్యోగోన్నతులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, ఎస్.ఎస్.ఎన్.మూర్తి, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



ఉద్యోగికి బహుమతి అందజేస్తున్న వెంకటేశ్వరరావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవల్ని అందించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. బస్టాండులోని గుంటూరు-1, 2 డిపోలతోపాటు, గ్యారేజీలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమయపాలన పాటిస్తూ సకాలంలో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆర్టీసీకి అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ప్రజారవాణా అధికారి రవికాంత్, గుంటూరు-1, 2 డిపో మేనేజర్లు రామకృష్ణ, అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమ

ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: అమరావతి రోడ్డు నగరాలులోని భాష్యం ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం 'ఇంటర్నెట్ వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులు వి.శ్రీశరణ్య(ప్రథమ), ఆర్.సాయి సందీప్ (ద్వితీయ), 8వ తరగతి విద్యార్థి ఎస్‌కే నజియా(తృతీయ) స్థానాలు పొందారు. భాష్యం విద్యాసంస్థల జోనల్ అధికారి కల్లూ స్వప్న విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్.కృష్ణవేణి, భాష్యం ఛాంప్స్ హెచ్‌ఎం ప్రవల్లిక, గణిత ఉపాధ్యాయిని తేజస్విని పాల్గొన్నారు.



విజేతలతో భాష్యం జోనల్ అధికారి స్వప్న, ప్రిన్సిపల్ కృష్ణవేణి



విజేతలకు బహుమతులు అందజేసిన నారాయణ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: స్తంభాలగరువులోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభా పాటవ పోటీలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న సౌమ్య ప్రథమ, యోగస్వి ద్వితీయ, దీక్షిత తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ వై.శ్రీనివాసరావు, ఏజీఎం జానకీరామ్‌రెడ్డి, కోఆర్డినేటర్ అనుపమ, ఏవో శ్రీనివాసరావు, పదో తరగతి ఇన్‌ఛార్జి హైమావతి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

జీఎంసీ కమిషనర్‌తో 'ఈనాడు ఫోన్ ఇన్' రేపు

సమస్యలు తెలియజేయాల్సిన నంబరు: 0863– 2224202



కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ పరిధిలో నెలకొన్న స్థానిక సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేందుకు వీలుగా 'ఈనాడు ఫోన్ ఇన్' శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరగనుంది. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, కాల్వల పూడికతీతలు, వీధిదీపాలు వంటి సమస్యలను నేరుగా జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టికి తీసుకు రావచ్చు. సదరు సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

– న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు)

సహాయ నిధికి విరాళం



సీఎంకు చెక్కు అందిస్తున్న కడియాల సుబ్బారావు తదితరులు

గుంటూరు సాంస్కృతికం: పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కడియాల సుబ్బారావు నేతృత్వంలో పలువురు విశ్వబ్రాహ్మణ ప్రముఖులు వరద బాధితుల సహాయార్థం గురువారం రూ.1.90 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. సీఎంను కలిసి వారిలో సింహాద్రి కనకాచారి, కందెపు వెంకట భాస్కరరావు, మేడూరి శివరామకృష్ణ, నాగేశ్వరాచారి, పి.లక్ష్మణాచారి, మహేశ్వరాచారి, సిద్ధి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మీడియా పాత్ర ఎంతో కీలకం

పట్టాభిపురం: సమాజంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ, పత్రికా సమాచార కార్యాలయం ఆధ్వర్యంలో వార్తాలాప్ వర్క్‌షాప్ నిర్వహించారు. నసీర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంతో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. సిద్దార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌బాబు మాట్లాడుతూ మారుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇటీవల చట్టాలను సవరించారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ కృష్ణారెడ్డి, హిందూ పత్రిక ప్రతినిధి సాంబశివరావు, జనం పత్రిక సంపాదకులు వెంకటరమణ పాల్గొన్నారు.

దారి దయనీయం.. కాల్వలు అధ్వానం



హౌసింగ్‌బోర్డు ఎక్స్‌టెన్షన్‌లో రహదారి దుస్థితి

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్జీవో కాలనీ, నేతాజీనగర్, బంజారానగర్, వెంకటరమణ కాలనీ, సీతమ్మకాలనీల ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు. రహదారులు, కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. వీధి దీపాలు లేక రాత్రివేళ అంధకారం అలముకుంటోంది. నేతాజీనగర్ ప్రాంతంలో రహదారులు గోతులమయంగా మారాయి. ఎన్జీవో కాలనీలో రుక్మిణి సమేత శ్రీకృష్ణదేవాలయం దగ్గర డ్రెయిన్‌కి సైడ్ వాల్‌లేక ప్రమాదకరంగా ఉంది. నేతాజీనగర్, వెంకటరమణ కాలనీలో సైడ్ కాల్వలు లేక మురుగు ముందుకు కదలడం లేదు. హౌసింగ్‌బోర్డు ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఖాళీస్థలాల్లో జమ్ము, పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగి.. వాటి నుంచి విషపురుగులు, సర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కచ్చా డ్రెయిన్‌లో కదలని మురుగు

28 నుంచి బీఎస్సీ (హానర్స్) వ్యవసాయం కోర్సులో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) వ్యవసాయం కోర్సులో అగ్రిసెట్ ద్వారా ప్రవేశాలకు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఈనెల 28 నుంచి 30 వరకు జరగనుందని వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ angrau.ac.in ని చూడాలని కోరారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే : మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో సమర్థనం సంస్థ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 406 మంది పాల్గొన్నారు. 32 ప్రముఖ కంపెనీ ప్రతినిధులు పాల్గొని 146 మంది నిరుద్యోగ యువతను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సి.హెచ్.రామకృష్ణ మూర్తి, ప్రిన్సిపల్ పి.ఎం.ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, సమర్థన సభ్యులు సెంథిల్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

గుంటూరు రైల్వే: రైల్వే కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న మజ్దూర్ యూనియన్‌కే ఓటెయ్యాలని ద.మ.రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రచారంలో భాగంగా గత మూడు రోజుల నుంచి గుంటూరు రైల్వే డివిజన్‌లో నిర్వహిస్తున్న ప్రచారం గురువారం ముగిసింది.

మిర్చియార్డులో విజిలెన్స్ తనిఖీలు

మిర్చియార్డు(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డులో రోజువారీ జరిగే క్రయవిక్రయాలపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. గత అయిదేళ్లలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై విజిలెన్స్ విచారణ గత కొన్నాళ్లగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్‌కుమార్, సీఐలు చంద్రశేఖర్, శివాజీలు గురువారం మిర్చియార్డులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. యార్డులో జీరో వ్యాపారం జోరుగా సాగుతోందని వచ్చిన ఫిర్యాదులపై వీరు దృష్టి సారించారు. యార్డులోకి సరకు ఎలా వస్తుంది.. విక్రయాలు ఎలా జరుగుతాయి. కొనుగోళ్లు, అమ్మకాలు ముగిశాక బస్తాలను వెలుపలకు ఎలా పంపుతారని ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. వేమెన్ స్లిప్పులను పరిశీలించారు. బిడ్డింగ్ హాల్‌ను సందర్శించి అక్కడ జరిగే కార్యకలాపాలు పరిశీలించారు. లోపలకు వచ్చే సరకును నల్లపాడు రోడ్డు వైపు గేటు వద్ద ఎలా ఎంట్రీ చేస్తారో రికార్డులను తనిఖీ చేశారు. ఈ-నామ్ ద్వారా విక్రయాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సరకు వెలుపలకు వెళ్లే చిలకలూరిపేట రోడ్డు వైపు ఉన్న గేట్లలో రికార్డులను వీక్షించారు. కొండవీడు కోల్డ్‌స్టోరేజ్‌ను సందర్శించిన విజిలెన్స్ అధికారులు అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి ఆరా తీశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 25న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు. దీనివల్ల శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చంద్రమౌళినగర్ ఐదవలైను నుంచి ఏడవలైను వరకు కరెంటు ఉండదని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

❖ నగరంపాలెం పరిధిలోని రఘురామ్‌నగర్‌లో పలు వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో సమస్యను 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి సమస్య పరిష్కరించారు.

❖ బ్రాడీపేటలోని పలు ప్రధాన వీధుల్లో కాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకుతోడుగా' దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాల్వల్లో పూడికతీయించి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

– న్యూస్‌టుడే, నగరంపాలెం

నగదు రహిత లావాదేవీలు పెరగాలి

గుంటూరు రైల్వే: రైల్వేలో జరిగే అన్ని లావాదేవీలు నగదు రహిత విధానంలోనే జరగాలని ద.మ.రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజరు సాంబశివరావు సూచించారు. సికింద్రాబాద్ నుంచి వచ్చిన ఆయన గురువారం రిజర్వేషన్ కార్యాలయంతోపాటు ఇతర చోట్ల పరిశీలించిన అనంతరం ఉద్యోగులతో మాట్లాడారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా రమణ యశస్వి

గుంటూరు వైద్యం: సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్‌గా రమణ యశస్విని నియమించేందుకు అధికారులు పంపిన ప్రతిపాదనకు గురువారం ముఖ్యమంత్రి ఆమోదం లభించింది. ఆయన ప్రస్తుతం ఆర్థో విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు.

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా సుందరాచారి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల ప్రధానాచార్యులుగా ఆచార్య సుందరాచారిని నియమించేందుకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం విడుదల కానున్నాయి.

నిధుల కేటాయింపు హర్షణీయం

బ్రాడీపేట, న్యూస్‌టుడే: అమరావతి రాజధానికి ప్రాంతానికి రైల్వే స్టేషన్, రైల్వే లైన్లు, కృష్ణానదిపై వంతెన నిర్మించేందుకు కావాల్సిన నిధులను కేంద్రప్రభుత్వం కేటాయించటం హర్షణీయమని భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగవిఠల్ ఆనందం వ్యక్తం చేశారు. గురువారం బ్రాడీపేటలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

కలెక్టరేట్: అమరావతికి 57 కిలోమీటర్ల కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలపడం హర్షణీయమని అఖిలభారత పంచాయతీ పరిషత్తు(న్యూదిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిట్స్ నిర్వాహకుడి అరెస్ట్

పట్టాభిపురం, న్యూస్‌టడే: ప్రజల ఉంచి చిట్స్ పేరిట డబ్బు వసూలు చేసి మోసగించిన వ్యక్తిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. చైతన్యపురికాలనీకి చెందిన శ్రీహర్షారెడ్డి చుట్టుపక్కల ప్రాంతాల వారితో చిట్స్ వేయించాడు. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పలు రకాల చిట్స్ నిర్వహిస్తున్నాడు. మాయమాటలతో బురిడీ కొట్టించి వసూలైన డబ్బుతో పరారయ్యాడు. అలా రూ.74 లక్షల వరకు స్థానికులకు చెల్లించాల్సి ఉండగా చెల్లించలేదు. దీనితో నాగలక్ష్మి అనే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈకేసులో శ్రీహర్షారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.

పంటల బీమా నమోదుకు చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్: రబీలో సాగు చేస్తున్న రైతులను పంటల బీమాలో నూరు శాతం నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ద్వారా సమీక్షించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం రబీలో 2024-25లో పంటలు సాగు చేస్తున్న రైతులంతా ఇష్టపూర్వకంగా నిర్దేశించిన ప్రీమియం షేర్‌ను చెల్లించి పంటల బీమాలో నమోదు కావాల్సి ఉందన్నారు.

తామర పురుగుతో ఆదాయానికి గండి

కలెక్టరేట్: మిరప లాంటి అధిక వాణిజ్య విలువ కలిగిన పంట ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. కానీ తామర పురుగుల వంటి సమస్యలతో ఈ మధ్య కాలంలో రైతుల ఆదాయానికి గండి పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. క్యాబి అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా గుంటూరులో గురువారం సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. తామర పురుగు సమస్యను అధిగమించడానికి కేవలం రసాయనాలపై మాత్రమే ఆధారపడకుండా ఇతర పద్ధతులను కూడా అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో శాస్త్రవేత్తలు డాక్టర్ శిరీష, సాంబశివరావు, విజ్ఞాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రమేష్‌బాబు, అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు మధు మంజరి, డాక్టర్ మహేష్, ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ మోహనరావు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంపై జగన్ అర్థం లేని ప్రేలాపనలు'

బ్రాడీపేట: కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ అర్థం లేని ప్రేలాపనలు పలుకుతున్నారని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం జనసేన జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల మాత్రమే అయ్యిందని, ఇంతలోనే రాష్ట్రంలో ఏదో జరిగిపోయినట్లు జగన్ మాట్లాడటం సరికాదన్నారు. జనసేన నాయకుడు చందు సాంబశివరావు మాట్లాడారు.

పట్టాభిపురం, న్యూస్‌టుడే: సహాన ఘటనలో నిందితుడు నవీన్ వైకాపా నేతల వల్లే రౌడీషీటర్‌గా మారాడని ఆయన తల్లే వాపోయారు. జగన్ మాత్రం నవీన్ తెదేపా సానుభూతిపరుడని ప్రచారం చేయడం సిగ్గుచేటని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్ రాజకీయాలకు అనర్హుడని ధ్వజమెత్తారు.

అరండల్‌పేట: దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన వాటా కల్పించి వారికి అండగా ఉంటే.. ప్రస్తుత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తల్లిని, చెల్లిని మోసం చేసి చరిత్రలో నిలిచారని తెదేపా జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య మండిపడ్డారు. గురువారం అరండల్‌పేటలోని కార్యాలయంలో లక్ష్మయ్య విలేకరులతో మాట్లాడారు.

మోసం చేసిన సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడి ఆట కట్టిస్తాం

పట్టాభిపురం: ఉద్యోగం ఇస్తానని లక్షలాది రూపాయలు వసూలు చేసి నిరుద్యోగుల్ని మోసం చేసిన సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడి ఆట కట్టిస్తామని ఎమ్మెల్యే గల్లా మాధవి హెచ్చరించారు. అమరావతిరోడ్డులో ఇటీవల డవలప్రీస్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడు శ్రావణ్ నగదు వసూలు చేసి ఉద్యోగాలు ఇచ్చినట్లు నమ్మించి రెండు, మూడు నెలల పాటు జీతాలు ఇవ్వకుండా ముఖం చాటేసి మోసగించి పరారయ్యాడని బాధితులు ఎమ్మెల్యే మాధవికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. క్యాంప్ కార్యాలయంలో బాధితులు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు.

అక్రమ ఆస్తులపై పార్లమెంటులో చర్చించాలి

పట్టాభిపురం: వైకాపా అధ్యక్షుడు జగన్ అక్రమ ఆస్తులపై పార్లమెంటు సమావేశాల్లో చర్చ జరపాలని మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. గుంటూరులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నైతిక విలువల్లేకుండా సొంత చెల్లిపై కోర్టుకెక్కిన జగన్ చరిత్ర హీనుడుగా నిలవబోతున్నారు. జగన్ ముఖ్యమంత్రి కాక ముందు ఆస్తుల విలువ ఎంత.. ఇప్పుడు ఎంత.. అని ప్రశ్నించారు. జగన్ అక్రమ ఆస్తులు, ఆయన సంస్థల్లోకి వచ్చిన పెట్టుబడులపై ఎన్డీఏ ప్రభుత్వం చర్చలు జరపాలి. జగన్ బరితెగింపు చూస్తుంటే ఆయన వెనుక పెద్ద తలకాయలు ఉన్నాయని అనుమానం కలుగుతోంది. ప్రధానమంత్రి దీనిపై తక్షణమే ప్రత్యేక చర్చ పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. జగన్ అక్రమ ఆస్తులను కేంద్రం తక్షణమే జాతీయం చేయాలి.